

వైద్యుల పనితీరు మారాలి: డీసీహెచ్‌ఎస్

పాలకొండ, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): వైద్యుల పనితీరు మారాలని, ఆసుపత్రికి వచ్చే రోగులకు నమ్మకం కల్పించాలని జిల్లా సమన్వయ అధికారి (డీసీహెచ్‌ఎస్) నాగభూషణం సూచించారు. మంగళవారం పాలకొండ ఏరియా ఆసుపత్రిని సందర్శించారు. ఈ రోజు రోగికి చూసిన వైద్యులు రేపు అందుబాటులో లేకపోతే ఎలా? అంటూ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఓపీ తర్వాత కూడా ఆసుపత్రిలో కొంత సమయం ఉండాలని సూచించారు. ప్రసవాల సంఖ్య పెరగాలన్నారు. మెరుగైన వైద్యసేవలందిస్తేనే ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజలకు నమ్మకం ఏర్పడుతుందన్నారు.

ఇంకా ముంపులోనే

- గత మూడు రోజులుగా భారీ వర్షాలు
- కాస్త తెరిపిచ్చినా.. ముంపులోనే పంటలు
- నీటిలోనే లోతట్టు ప్రాంతాలు
- ఉప్పొంగుతున్న వాగులు, వంకలు
- కోతకు గురైన రోడ్లు.. ప్రజలకు ఇబ్బందులు


భామిని: లివిరిలో కనపల చెరువుకు గండి పడిన దృశ్యం

పార్వతీపురం/భామిని/కొమరాడ, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): అల్పపీడనం ప్రభావంతో జిల్లాలో గత రెండు, మూడు రోజులుగా కురిసిన భారీ వర్షాలు జిల్లాను ముంచెత్తాయి. మంగళవారం తెరిపిచ్చినప్పటికీ చాలా ప్రాంతాల్లో వరదనీరు తొలగిపోలేదు. లోతట్టు ప్రాంతాలు, పంట పొలాలు ఇంకా నీటిలోనే ఉన్నాయి. జలాశయాలు, చెరువులు, వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. గిరిజన, మైదాన ప్రాంతాల్లో రహదా రులు కోతకు గురయ్యాయి. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులపాలయ్యారు.

పలుచోట్ల ఇలా..

భామిని మండలం లివిరి, బిల్లుమడ, ఘనసర, బాలేరు, దిమ్మిడిజోల, నులకజోడు తదితర గ్రామాల్లో చెరువులకు గండ్లు పడ్డాయి. దీంతో పంట పొలాలకు తీవ్ర నష్టం వాటిల్లింది. కొన్నిచోట్ల ముంపునకు గురవగా.. మరోకొన్ని చోట్ల పొలాల్లో ఇసుక మేటలు వేశాయి. లివిరిలో చీకటితోట గెడ్డతో పాటు మూడు చెరువులకు గండ్లు పడ్డాయి.కొద్దిరోజుల కింట వరినాట్లు వేసిన వందలాది ఎకరాలు నీట మునిగాయి. నీరు ఇదే విధంగా ఉంటే వరిపైరు కుళ్లి పోయే అవకాశం ఎకరాకు రూ.25 వేల వరకు నష్టం వాటిల్లనుందని రైతులు చెబుతున్నారు.

రాకపోకలకు ఇబ్బందులు

- వరద ఉధృతి కారణంగా లవిరి మార్గంలో


కొమరాడ మండలం పాలెం వద్ద ముంపులో ఉన్న పొలాలు

యాదవకాలనీకి సమీపంలో రోడ్డు కొట్టుకుపోయింది. దీంతో ప్రజలు, విద్యార్థులు రాకపోకలకు ఇబ్బందులు తప్పలేదు. ఘసర గ్రామంలో గొయ్యిమానుగెడ్డకు గండి పడడంతో సుమారు వంద ఎకరాలు ముంపునకు గుర య్యాయి. మునులకజోడులో వంశధార వరదకాలువ గట్టు రహదారిపై నీరు ప్రవహించడంతో ఆ గ్రామానికి రాకపోకలు అంతరాయం ఏర్పడింది. బిల్లుమడ, మజ్జివారివీధికి చుట్టుపక్కల వర్షపునీరు చొరబడడంతో ఆయా ప్రాంతవాసులు నానా అవస్థలు పడ్డారు.


వరద ఉధృతికి కొట్టుకుపోయిన లివిరి గ్రామ రహదారి


కురుపాం మండలం పెదగొత్తులి వద్ద చెక్‌డ్యాం ఇలా..

'పలు గ్రామాల్లో పర్యటించి గండ్లను పరశీలించాం. ప్రజల రాకపోకలకు అంతరాయం ఏర్పడడంతో వీఆర్‌వోలు అక్కడే బస చేశారు. బిల్లుమడలో రెండు కుటుంబలకు 25 కిలోల బియ్యం, నిత్యావసర సరుకులు అందించాం.' అని భామిని తహసీల్దార్ ఎన్‌.శివన్నారాయణ తెలిపారు.

- కొమరాడ మండలం గుమ్మిడిగడ్డ పొంగి ప్రవహిస్తుండడం వల్ల మాదలంగి, పాలెం, కెమిశిల పంచాయతీలో పరిధిలో ఉన్న సుమారు 30 గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. ఆ ప్రాంతంలో వరి పంట పొలాలు కూడా నీట మునిగాయి. కాగా పార్వతీపురం సబ్ కలెక్టర్ ఆర్‌.వైశాలి గుమ్మిడిగెడ్డను పరిశీలించారు. గెడ్డను ఎవరు దాటకుండా చూడాలని ఆదేశించారు. అనంతరం కొమరాడ తహసీల్దార్ కార్యాలయం, పీహెచ్‌సీ, ఎరువుల విక్రయ కేంద్రాలను పరిశీ లించారు. కర్లగండ వద్ద దోనిలో వరద ప్రవాహం అధికంగా ఉండగా.. దాని పక్క నుంచే ప్రజలు రాకపోకలు సాగించలేని పరిస్థితి ఏర్పడింది. మక్కువ మండలం కవిరిపల్లి వద్ద గల కాజ్‌వేపై వరదనీటి ప్రవాహం పెరగడంతో పలు గిరిజన గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి.
- తితిరి పంచాయతీలోని ఆవిరి-బోనగోడ రహదారి వరదలకు కొట్టుకుపోయింది. కురుపాం మండలం పెద్దగొత్తిలి వద్ద చెక్‌డ్యామ్‌లు కొట్టుకుపోయాయి. పార్వతీపురం మండలం పుట్టూరు, తాళ్లబురిడి ప్రాంతాల్లో ఉన్న సాగిగెడ్డ ప్రవాహం వల్ల పంట పొలాలు ముంపునకు గురయ్యాయి.

చిధ్రమైన రహదారులు..

పాలకొండ, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల కారణంగా జిల్లాలోని పలు రహదారులు చిధ్రమయ్యాయి. మరికొన్ని రోడ్లు.. నడిచేందుకు వీలు లేకుండా మారాయి. పాలకొండ మండలం ఓని, గుడివాడ ప్రధాన రహదారి గుంతలమయంగా మారింది. ప్రస్తుతం వర్షపునీరు చేరుతుండడంతో (మిగతా 8వ పేజీలో...)


రాళ్లు తేలిన కోటకొండ రహదారి

కట్టగలరో.. లేదో?

- అదనపు సాయం పొందినా.. పనులు చేపట్టలేని పరిస్థితి
- జగనన్న కాలనీల్లో ఊపందుకోని ఇళ్ల నిర్మాణాలు
- వివిధ కారణాలతో ముందుకు రాని లబ్ధిదారులు
- నోటీసులు ఇస్తున్న అధికారులు
- నివాసయోగ్యం కాని ప్రాంతాల్లో స్థలాలు.. మౌలిక వసతులు కరువు
- దృష్టి సారించని గత వైసీపీ సర్కారు
- రాష్ట్ర ప్రభుత్వంపైనే ఆశలు

పార్వతీపురం, ఆగస్టు19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు ఊపందు కోవడం లేదు. పనుల్లో కదలిక ఉండడం లేదు. నిర్మాణాల వేగవంతానికి కూటమి ప్రభుత్వం అదనంగా లబ్ధిదారులకు ఆర్థిక సాయం అందించినా.. ఏ మాత్రం పరిస్థితి మారలేదు. డబ్బులు తీసుకున్న వారిలో అతికొద్దిమంది మాత్రమే నిర్మాణాలు పూర్తి చేశారు. వివిధ కారణాలతో పనులు చేపట్టని వారికి అధికారులు నోటీసులు అందిస్తున్నారు. డబ్బులు తిరిగివ్వడమో.. ఇంటి నిర్మాణ స్థాయి మార్చడమో? చేయాలని స్పష్టం చేస్తున్నారు.

వైసీపీ హయాంలో..

వాస్తవంగా గత వైసీపీ ప్రభుత్వం నివాసయోగ్యం కాని సుదూర ప్రాంతాల్లో ఇళ్ల స్థలాలు మంజూరు చేసింది. గెడ్డలు, కొండ వాగులు, శ్మశానవాటికలు, చెరువులు, అటవీ ప్రాంత సమీపంలో అవి ఉండడం, నిధులు చాలక పోవడంతో చాలామంది లబ్ధిదారులు గృహ నిర్మాణాలకు ఆసక్తి చూపలేదు. పేదలకు ఇళ్లు కట్టించి ఇస్తామన్న నాటి ప్రభుత్వం మాట మార్చేసింది. జగనన్న కాలనీల అభివృద్ధిపై దృష్టి సారించలేదు. రోడ్లు, కాలువలు ఇతర మౌలిక


సాలూరు: ఇంటి నిర్మాణం మొదలు పెట్టాలని లబ్ధిదారుకు నోటీసు ఇస్తున్న హౌసింగ్ సిబ్బంది (ఫైల్)

వసతులు కల్పించలేదు. అధికారుల ఒత్తిడితో అతికొద్దిమంది మాత్రమే అప్పులు చేసి పనులు చేపట్టారు. అయినప్పటికీ చాలా ఇళ్లు వివిధ దశల్లోనే నిలిచిపోయాయి.

ఇదీ పరిస్థితి..

- జిల్లాలో 401 జగనన్న లేఅవుట్‌లు ఏర్పాటు చేశారు. ఇందులో (మిగతా 8వ పేజీలో...)

మన్యంలో సాగు, తాగునీటి

సమస్య పరిష్కరిస్తాం

- జంఝావతి, తోటపల్లి ద్వారా సరఫరా
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్

పార్వతీపురం/బెలగాం, ఆగస్టు19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బీజేపీని బలోపేతం చేసి.. ప్రతి కార్యకర్తకూ భరోసా కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ అన్నారు. మంగళవారం ఆయన పార్వతీపురంలో పర్యటించారు. తొలుత జిల్లా అధ్యక్షుడు డి.శ్రీనివాసరావుతో కలిసి శోభా యాత్రలో పాల్గొన్నారు. ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి పాత బస్టాండ్ వరకు ఇది కొనసాగింది. అనంతరం స్థానిక ప్రైవేట్ కల్యాణ మండపంలో కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'కార్యకర్తలను ఉత్తేజ పరిచి పార్టీని బలోపేతం చేసేందుకు ప్రతి జిల్లాలో పర్యటిస్తున్నా. పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తల అభిప్రాయాలను సేకరించి కార్యాచరణ రూపొందిస్తాం. జిల్లాలో జాతీయరహదారి నిర్మాణం జరుగుతుంది. ఇది పూర్తయితే మన్యం ముఖచిత్రం మారిపోతుంది. వలసలు అరికట్టి.. (మిగతా 8వ పేజీలో...)


శోభాయాత్రలో పాల్గొన్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్

తుఫాన్ నష్టాన్ని గుర్తిస్తున్నాం

- సబ్ కలెక్టర్ స్వప్నిల్ పవర్

గుమ్మలక్ష్మీపురం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): పాలకొండ సబ్ డివిజన్ పరిధిలో తుఫాన్ కారణంగా జరిగిన నష్టాన్ని గుర్తిస్తున్నామని, త్వరలో పూర్తి వివరాలు వెల్లడిస్తామని సబ్ కలెక్టర్ స్వప్నిల్ పవర్ జగన్నాథ్ తెలిపారు. మంగళవారం గుమ్మలక్ష్మీపురం తహసీల్దార్ కార్యాలయాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా విలేఖర్లతో మాట్లాడుతూ.. వర్షాల కారణంగా దెబ్బతిన్న ఇళ్లు, రహదారుల వివరాలను తహసీల్దార్ల ద్వారా సేకరిస్తున్నామన్నారు. వాటిపై నివేదిక రూపొందించి ప్రభుత్వానికి పంపిస్తామన్నారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్‌ను కురుపాం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి, వివిధ సంఘాల గిరిజన నాయకులు దుశ్శాలువాతో సత్కరించారు. నియోజకవర్గ సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. గుమ్మలక్ష్మీపురంలో గిరిజన భవన నిర్మాణానికి సహకరించాలని కోరారు. అనంతరం ఆయన తిక్కబాయి గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలను పరిశీలించారు. గతంలో పాముకాటుకు గురై కోలుకున్న గిరిజన విద్యార్థితో మాట్లాడారు. విద్యార్థులు బాగా చదువుకోవాలని సూచించారు.


సబ్ కలెక్టర్‌ను సత్కరిస్తున్న ప్రభుత్వ విప్ జగదీశ్వరి, గిరిజన సంఘం నాయకులు

వసతిగృహ విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

- కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వెనుకబడిన తరగతులు, సాంఘిక సంక్షేమ వసతి గృహ విద్యార్థుల ఆరోగ్యం, విద్యపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ ఆదేశిం చారు. ఈ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. మంగళవారం కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో మాట్లాడుతూ.. 'ఏటా టెన్త్‌లో వసతిగృహ విద్యార్థుల ఉత్తీర్ణత బాగుంది. భవిష్యత్తులో కూడా ఇదే విధంగా కొనసాగాలి. ఒక్కో హాస్టల్‌ను ఒక మండల ప్రత్యేకాధికారి దత్తతను తీసుకున్నారు. వారి సందర్శన సమయంలో వసతిగృహంలో ఎటువంటి లోటుపాట్లు ఉండరాదు. విద్యార్థులకు సంబంధించి హెల్త్ రిజిస్టర్లు నిర్వహించాలి. భవిత కార్డులను కూడా వినియోగించాలి. హాస్టల్లో గదుల్లో వెలుతురు, గాలి వచ్చేలా ట్యూబ్‌లైట్లు , ఫ్యాన్స్ ఉండాలి.' అని తెలిపారు.


అడారిగెడ్డను పరిశీలిస్తున్న కలెక్టర్

వైద్యసేవలపై ఆరా

పార్వతీపురం రూరల్: డోకిశిలా పీహెచ్‌సీని కలెక్టర్ సందర్శించి.. రోగులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. అనంతరం మందులు, రికార్డులు పరిశీలించారు. అక్కడి నుంచి పుట్టూరు గ్రామానికి వెళ్లి సాకిగెడ్డను పరిశీలించారు. తక్షణమే ఆ ప్రాంతంలో ఆక్రమణలు తొలగించాలని ఆదేశించారు. పంటలు ముంపునకు గురవకుండా చూడాలని ఇరిగేషన్ శాఖ అధికారులకు సూచించారు.

అడారి గెడ్డ పరిశీలన

మక్కువ రూరల్: దుగ్గేరుకు సమీపంలోని అడారిగెడ్డను కలెక్టర్ పరిశీలించారు. గెడ్డవాగు ప్రాంతాల్లో ప్రజలకు ముప్పువాటిల్లకుండా హెచ్చరిక బోర్డులు పెట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అంతకు ముందు ఆయన గుంటభద్ర సమీపంలో మినీ వంతెన నిర్మాణానికి ప్రతిపాదించిన గెడ్డ ప్రాంతాన్ని పరిశీలించారు. గత ప్రభుత్వ హయాంలో అడారిగెడ్డపై వంతెన నిర్మాణానికి రూ.6కోట్లు మంజూరు కాగా కాంట్రా క్టర్లు ముందుకు రాకపోవడంతో నిధులు రద్దయినట్లు ఇంజనీరింగ్ అధికారులు వివరించారు. నవంబరు తరువాత వంతెన నిర్మాణానికి చర్యలు తీసుకుంటా మని కలెక్టర్ హామీ ఇచ్చారు. ఆ తర్వాత కలెక్టర్ దుగ్గేరులో ఎరువుల షాపును తనిఖీ చేశారు. త్వరలో జిల్లాకు అవసరమైన యూరియా వస్తుందన్నారు. నానో యూరియా, డీఏపీ వాడడం వల్ల అధిక దిగుబడులు పొందచ్చని తెలిపారు.





గణేష్ మండపాలకు

సింగిల్ విండో సిస్టమ్

- ఎస్పీ మాధవరెడ్డి



బెలగాం, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి) : జిల్లాలో గణేష్ మండపాల ఏర్పాటుకు సింగిల్ విండో సిస్టమ్ ఏర్పాటు చేశామని ఎస్పీ మాధవరెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన విలేఖర్లతో మాట్లాడుతూ.. మండపాల అనుమతుల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వినాయక చవితి పండుగ నేపథ్యంలో ప్రతిఒక్కరూ నిబంధనలు పాటించాలని సూచించారు. ఇంతకుముందు అగ్నిమాపక, పురపాలక, విద్యుత్, పోలీస్ తదితర శాఖల అనుమతులు తీసుకోవాల్సి వచ్చేందని.. ఇప్పుడా అవసరం లేదని తెలిపారు. ఆన్‌లైన్ దరఖాస్తులో వివరాల న్నింటినీ పొందుపరిచి అనుమతులు పొందొచ్చని వెల్లడించారు.

అలనాటి భవనం... ఆధునిక రూపం

- మోతీమహల్‌కు కొత్త హంగులు

విజయనగరం కల్చరల్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): శతాబ్దాల చరిత్ర గల విజయనగరం కోటలోని పురాతన భవనాలు ఆధునిక హంగులు అద్దుకుంటున్నాయి. వీటిలో మోతీమహల్‌కు ఓ ప్రత్యేకత ఉంది. విజయనగరం సంస్థానాధీశుల పురాతన కట్టడాల్లో ఇదొకటి. ఈ భవనంలో ఒకప్పుడు మహిళా కళాశాలను నిర్వహించారు. రాను, రాను భవనం శిథిలావస్థకు చేరుతుండడంతో కొత్త హంగులతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్ది మళ్లీ విద్యాలయాలను కొనసాగించడానికి మాన్సాస్ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. పీవీజీ రాజు తన తండ్రి అలక్‌నారాయణ గజపతిరాజు పేరిట మాన్సాస్ ట్రస్టు ఏర్పాటు చేశారు. ఈ ట్రస్టు పేరుతో ఉన్న అనేక భవనాలను విద్యాలయాలకు ఉపయోగించేవారు. కోటలో ఉన్న మోతీమహల్ భవనంలో పాఠశాల, కళాశాల ఉండేవి. దీనిని మళ్లీ వినియోగంలోకి తీసుకువచ్చేందుకు.. మోతీమహల్ రూపురేఖలు చెదిరిపోకుండా ఆధునిక హంగులతో తీర్చిదిద్దుతున్నారు. ఈ భవనం ముందుభాగంలో విశాలమైన ప్రాంగణంలో పీవీజీ రాజు విగ్రహ నిర్మాణానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ భవనం ఆధునిక హంగుల ప నులు కూడా శరవేగంగా జరుగుతున్నాయి. ఈ నెలఖరులోగా ఈ భవనాన్ని మాన్సాస్ చైర్మన్, గోవా గవర్నర్ అశోక్ గజపతిరాజు చేతుల మీదుగా ప్రారంభించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు.



పీవీజీ విగ్రహం ఏర్పాటుకు ఇలా..



కొత్త రూపు సంతరించుకుంటున్న మోతీమహల్





పసుపుతో ముత్యాలమ్మ..
గాజులతో తోగాలమ్మ

భోగాపురం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): గుడివాడ పంచాయతీలో గల ముత్యాలమ్మ, తోగాలమ్మ అమ్మవార్లను మంగళవారం భక్తులు వినూత్నంగా అలంకరించారు. ముత్యాలమ్మ అమ్మవారిని పసుపు కొమ్ములతోను... తోగాలమ్మ అమ్మవారిని గాజులతోను అలంకరించారు. గుడివాడ పంచాయతీతో పాటు పరిసర గ్రామాల భక్తులు అమ్మవార్లను దర్శించుకొని... ప్రత్యేక పూజలు చేశారు.

డోలీలో 8 కిలోమీటర్లు

- గర్భిణిని తరలించిన గిరిజనులు
- సరైన రహదారి లేక అవస్థలు

అది అత్యంత క్లిష్టమైన సమయం. కానీ వాహనం ఊరులోకి రాలేని దైన్యం. ఆలస్యమైతే రెండు ప్రాణాలకు ప్రమాదం. ఇక చేసేదిలేక ఆ ఊరి జనం డోలీని పట్టుకున్నారు. నిండు గర్భిణిని 8 కిలోమీటర్ల దూరం మోసుకెళ్లి... 108 వాహనంలోకి ఎక్కించి.. ప్రసవం కోసం ఆస్పత్రికి తరలించారు. కొత్తబట్టివలసలో చోటుచేసుకున్న ఈ సంఘటన గిరిజనుల కష్టాలకు అద్దం పడుతోంది.



గర్భిణిని డోలీపై ఆసుపత్రికి తరలిస్తున్న గిరిజనులు

బొబ్బిలి రూరల్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోపాలరాయుడుపేట పంచాయతీ పరిధిలోగల కొత్తబట్టివలస గిరిజన గ్రామానికి చెందిన సిదరపు గౌరమ్మకు మంగళవారం పురిటి నొప్పులు ఎక్కువ కావడంతో డోలీలో తరలించాల్సి వచ్చింది. ఆ గ్రామానికి పక్కా రహదారి లేకపోవడం... ఇటీవల కురుస్తున్న వర్షాలకు ఉన్న రోడ్డు బురదమయం కావడంతో కొత్తబట్టివలస నుంచి గోపాలరాయుడుపేట వరకూ ఎనిమిది కిలోమీటర్లు డోలీలోనే గ్రామస్థులు మోసుకొని వెళ్లారు. అక్కడి నుంచి పది కిలోమీటర్ల దూరంలో గల పిరిడి పీహెచ్‌సీకి 108 వాహనంలో తరలించారు. అనంతరం వైద్యాధికారి రఘువంశీ పరీక్షించి ప్రసవానికి ఏర్పాట్లు చేయించారు. ఆమెకు మగబిడ్డ జన్మించాడని.. తల్లీబిడ్డలు క్షేమంగా ఉన్నారని రఘువంశీ తెలిపారు.

ఏటా వర్షాకాలంలో తప్పని అవస్థలు..

మండలంలోని కొత్త బట్టివలస, అక్కేనవలస, మోసూరువలస, సియోనువలస, కృపావలస తదితర గిరిజన గ్రామాలకు రోడ్డు సౌకర్యం లేదు. దీంతో వర్షాకాలంలో అనారోగ్యంతో బాధ పడేవారిని, గర్భిణులను డోలీలో ఆస్పత్రులకు తరలించాల్సి వస్తోంది. గోపాలరాయుడుపేట పంచాయతీ పరిధిలోని గిరిజన గ్రామాలు ప్రజలు రోడ్లు, ఇతర సదుపాయాల కోసం అనేకసార్లు అధికారులకు విన్నవించుకున్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టించుకోకపోవడంతో వీరి సమస్యలు ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా ఉన్నాయి. ఇదిలా ఉండగా... వందల కోట్లు రూపాయలు గిరిజనుల అభివృద్ధికి వెచ్చిస్తున్నామని పాలకులు పెద్ద ప్రచారం చేయడమే తప్ప నిజమైన అభివృద్ధి కానరావడం లేదని ప్రగతిశీల మహిళా సంఘ అధ్యక్షురాలు రమణి ఆరోపించారు.

ఉచిత ప్రయాణం.. మహిళల్లో ఆనందం

- 'స్త్రీ శక్తి'తో ఆర్టీసీ బస్సుల్లో పెరిగిన రద్దీ



పాలకొండ, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీల్లో భాగంగా ఆగస్టు 15 నుంచి స్త్రీశక్తి పథకానికి శ్రీకారం చుట్టింది. ఐదు రకాలైన బస్సు సర్వీసుల్లో ప్రయాణం చేసే అవకాశం కల్పించింది. ఉచిత బస్సు సౌకర్యంతో మహిళా ప్రయాణికుల సంఖ్య గణనీయంగా పెరిగింది. బస్సులు మహిళా ప్రయాణికులతో కిటకిటలాడుతున్నాయి. పాలకొండ ఆర్టీసీ డిపో పరిధిలో స్త్రీ శక్తి పథకానికి ముందు రోజుకు సగటున 27 వేల మంది రాకపోకలు సాగించేవారు. ఇందులో 15 వేల మంది మహిళలు ఉండేవారు. స్త్రీశక్తి పథకం ప్రారంభమైన తర్వాత ఈ సంఖ్య రెట్టింపైనట్టు ఆర్టీసీ అధికారులు చెబుతున్నారు. ఇంతకుముందు పాలకొండ-శ్రీకాకుళం ఎక్స్‌ప్రెస్ సర్వీసుల్లో రోజుకు సరాసరి రూ.14 వేల నుంచి రూ.16 వేల మధ్య టిక్కెట్ల రూపంలో నగదు వచ్చేది. ప్రస్తుతం స్త్రీ శక్తి పథకం ప్రారంభం తర్వాత అదే సర్వీసుకు రూ.50 వేల నుంచి రూ.60 వేల విలువైన టిక్కెట్లు అవుతున్నట్లు ఆర్టీసీ అధికారులు చెబుతున్నారు. దీనిని బట్టి స్త్రీ శక్తి పథకంతో ఆర్టీసీ బస్సుల్లో మహిళా ప్రయాణికుల సంఖ్య ఏ మేరకు పెరిగిందో అర్థం చేసుకోవచ్చు. ఇదిలా ఉంటే జిల్లాలోని పాలకొండ, సాలూరు, పార్వతీపురం డిపోల నుంచి విశాఖపట్నానికి ఎక్స్‌ప్రెస్ బస్సులు నడుపుతున్నారు. ఇలా సుదూర ప్రాంతాలకు ఒకే బస్సులో ప్రయాణించే అవకాశం కలుగుతుండడంతో మహిళలు వాటిని ఆశ్రయిస్తున్నారు. ఆ మేరకు ఎక్స్‌ప్రెస్ సర్వీసులకు డిమాండ్ పెరిగింది.



శ్రీకృష్ణలీలలు నృత్య రూపకంలో ఇలా...

వైభవంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు

విజయనగరం రూరల్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా శ్రీకృష్ణజన్మాష్టమి నవరాత్రి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. నగరంలోని గురజాడ కళాభారతి ఓపెన్ ఆడిటోరియంలో మంగళవారం శ్రీకృష్ణునికి నృత్య నీరాజనం నిర్వహించారు. విద్యార్థులు నృత్య ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. కొత్తపేటలోని కోదండ రామాలయంలో జన్మాష్టమి వేడుకలలో భాగంగా మంగళవారం రాత్రి భజన కార్యక్రమం నిర్వహించారు. నెల్లిమర్ల, గుర్ల, గరివిడి, బొబ్బిలి, ఎస్.కోట, గజపతినగరం, రాజాం తదితర ప్రాంతాల్లో ఈ నెల 24 వరకూ ఉత్సవాలు కొనసాగనున్నాయి.

పాలకొండ వాసికి యూఏఈ గోల్డెన్ వీసా

పాలకొండ, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక గెడ్డ కుమ్మరి వీధికి చెందిన లోచర్ల హరిబాబుకు యుఏఈ ప్రభుత్వం గోల్డెన్ వీసాను మంజూరు చేసింది. యూఏఈలోని నేషనల్ ఆయిల్ కంపెనీ శాస్త్రవేత్తల్లో ప్రత్యేక కేటగిరీ కింద అక్కడి ప్రభుత్వం హరిబాబుకు ఈ అవకాశం కల్పించింది. అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన కళాకారులు, క్రీడాకారులు, సినీ నటులు, మిగిలిన సెలబ్రిటీలకు మాత్రమే గోల్డెన్ వీసా అందజేస్తుంటారు. అలాంటి గౌరవం ఈ ప్రాంతవాసికి రావడం పట్ల అన్ని వర్గాల ప్రజలు, బంధువులు, మిత్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈమేరకు పాలకొండలో ఉంటున్న హరిబాబు తండ్రి లోచర్ల సంజీవరావు, మామయ్య పైల తవిటినాయుడు, బావ శ్రీను తదితరులు అభినందనలు తెలిపారు.



హరిబాబు


కొత్తగా 'పరీక్ష'

- జవాబు పత్రాల స్థానంలో బుక్‌లెట్లు
- పాఠశాల విద్యలో నూతన విధానం
- విద్యార్థుల ప్రగతి, సామర్థ్యం సులువుగా అంచనా

లక్కవరపుకోట, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పాఠశాల విద్యలో కొత్త విధానాన్ని తీసుకువచ్చింది. విద్యా వ్యవస్థను బలోపేతం చేస్తూ... విద్యార్థుల సామర్థ్యాన్ని అంచనా వేసేందుకు ప్రశ్న, సమాధాన పత్రాలకు స్వస్తి పలికి బుక్‌లెట్ విధానాన్ని తీసుకువచ్చింది. ప్రతి సబ్జెక్టుకూ స్టూడెంట్ అసెస్మెంట్ బుక్‌లెట్‌ను ప్రవేశ పెట్టింది. 1 నుంచి 10వ తరగతి వరకు నూతన పరీక్షా విధానాన్ని అమలు చేస్తున్నారు. పరీక్షలన్నీ సబ్జెక్టుల వారీగా బుక్‌లెట్లలోనే విద్యార్థులు రాయాలి. గతంలో మాదిరిగా ప్రత్యేకంగా ప్రశ్నపత్రాలు ఉండవు. బుక్‌లెట్‌లో ప్రశ్నలు, జవాబులకు సరిపడా పేజీలు కేటాయించింది. సోషల్‌కి సంబంధించిన మ్యాపులు, గణితానికి సంబంధించిన గ్రాఫ్‌లు, మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలకు సంబంధించిన ఓఎంఆర్ షీటు అన్నీ అందులోనే ఉంటాయి. విద్యార్థుల అపార్ ఐడీ నెంబర్, పూర్తి వివరాలు, ప్రశ్నపత్రం కోడ్, పరీక్ష సమయం అందులో ఉంటాయి. ఎఫ్ఏలు నాలుగు, ఎస్ఏలు రెండు పరీక్షల తేదీలతో పాటు బుక్‌లెట్‌లో ఉంటాయి. ఈ బుక్‌లెట్ ఆధారంగా విద్యార్థుల ప్రగతి సామర్థ్యాన్ని ఉన్నతాధికారులు అంచనా వేస్తారు. దీనిని బట్టి విద్యార్థులకు ఏబీసీడీ కేటగిరిలుగా కేటాయిస్తారు.



అపార్ ఐడీతో కూడిన విద్యార్థి వివరాల నమోదు పత్రాలు



ప్రశ్నపత్రం, ఓఎంఆర్ షీటుతో కూడిన బుక్‌లెట్

గత ప్రభుత్వంలో..

గత ప్రభుత్వ నిర్లక్ష్యాల వల్ల విద్యావ్యవస్థ పూర్తిగా గాడి తప్పింది. విద్యార్థులకు కనీసం ప్రశ్నపత్రాలు అందించలేని దుస్థితి నెలకొంది. ఉపాధ్యా యులు బోర్డులపై ప్రశ్నలు రాస్తే వాటిని విద్యార్థులు ఎక్కించుకొని పరీక్షలు రాసేవారు. కనీసం సుద్దముక్కకు కూడా డబ్బులు ఇవ్వని పరిస్థితులు నెలకొన్నాయి. దీనికి భిన్నంగా ప్రస్తుత కూటమి ప్రభుత్వం విద్యావ్యవస్థలో మార్పులకు శ్రీకారం చుడుతోంది.

పని ఒత్తిడి లేకుండా..

నూతనంగా ప్రవేశపెట్టిన పరీక్షా విధానాన్ని ఉపాధ్యాయులు స్వాగతిస్తూనే.. పని ఒత్తిడి తగ్గించాలని కోరుతున్నారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రవేశపెట్టిన పరీక్షా విధానం బాగుందనే అభిప్రాయం వ్యక్తం చేశారు. కాన్ఫరెన్స్, యాప్‌లు వంటివి తగ్గిస్తే మంచి ఫలితాలు వస్తాయనే అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఉపాధ్యాయులకు, విద్యార్థులకు పూర్తి అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని సూచిస్తున్నారు.



భామిని: నులకజోడు వద్ద కోతకు గురైన రోడ్డు



సంతకవిటి: అక్కరాపల్లి సమీపంలో చెరువును తలపిస్తున్న పొలాలు

నీట మునిగిన పొలాలు..

సంతకవిటి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): గత కొన్ని రోజులుగా కురిసిన వర్షాలకు మందరాడ, ముకుందపురం, అక్కరాపల్లి గ్రామాల్లో వరి పొలాలు నీటి మునిగాయి. దీంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రాకపోకలు బంద్

- కాజ్‌వేపై నీటి ప్రవాహం

మక్కువ రూరల్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కవిరిపల్లి వద్ద గల కాజ్‌వేపై వరదనీటి ప్రవాహం పెరగడంతో రాకపోకలు స్తంభించాయి. వెంగళరాయ సాగర్ ప్రాజెక్టులోని గోముఖి రెగ్యులేటర్‌లో సామర్థ్యానికి మించి వరద నీరు చేరింది. దీంతో ప్రాజెక్టు అధికారులు మంగళవారం మధ్యాహ్నం గోముఖి రెగ్యులేటర్ నుంచి నదిలోకి నీటిని విడిచిపెట్టారు. దీంతో నదీ పరీవాహక ప్రాంతమైన కవిరిపల్లి వద్ద గల కాజ్‌వే పైనుంచి సుమారు 5 అడుగుల ఎత్తులో వరదనీరు ప్రవహిస్తోంది. దీంతో మక్కువ, శంబర రోడ్డు మార్గంలో మంగళవారం మధ్యాహ్నం నుంచి రాకపోకలు నిలిచిపోయాయి. కవిరిపల్లి కాజ్‌వే ముంపునకు గురికావడంతో ప్రజలు, వాహనదారులు మక్కువ మండల కేంద్రానికి చేరుకోవడానికి అనేక ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. వెంగళరాయసాగర్ జలాశయం పూర్తిగా నిండటంతోనే మిగులు నీటిని నదిలోకి వదులుతున్నట్లు డీఈఈ డి.సురేష్ తెలిపారు.



కవిరిపల్లి వద్ద కాజ్‌వేపై నీటి ప్రవాహం

తగ్గిన వరద..

భోగాపురం, ఆగస్టు19 (ఆంధ్రజ్యోతి): గత 6 రోజులుగా కురిసిన వర్షాల కారణంగా నిర్మాణంలో ఉన్న ఎయిర్‌పోర్టు లోపల నుంచి వరదనీరు బయటకు ప్రవహిస్తూ చుట్టుపక్కల గ్రామాలను ముంచెత్తింది. ఎట్టకేలకు వాతావరణం మారడంతో మంగళవారం వరద నీటి ప్రవాహం తగ్గింది.



పాలకొండ: ఓని-స్కాట్‌దొరవలస రహదారి ఇలా..



కొమరాడ మండలం కర్లగండ వద్ద దోని పక్క నుంచి వెళ్తున్న ప్రజలు



భోగాపురం: ఎయిర్‌పోర్టు ప్రహరీ వద్ద తగ్గిన వరద నీరు

చెడు మార్గంలో వెళ్లొద్దు

గజపతినగరం, ఆగస్టు19 (ఆంధ్రజ్యోతి): హెచ్ఐవీ నిర్మూలనపై ప్రతిఒక్కరూ అవగాహన కల్పించుకోవాలని సీహెచ్‌వో ఇమామ్ అన్నారు. మండలంలోని గంగచోళ్లపెంట, పట్రువాడ గ్రామాల్లో మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు చెడు మార్గంలో వెళ్లకుండా చదువుపై దృష్టి సారించాలని సూచించారు. ఎల్‌డబ్ల్యూఎస్ శ్రీదేవి, ఏఎన్ఎం బీనా తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో ఎరువులు

గజపతినగరం, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): రైతులకు అవసరమైన ఎరువులు రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయని, ఏ ఒక్క రైతూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మండల వ్యవసాయ అధికారి కిరణ్‌కుమార్ తెలిపారు. మండలంలోని కెంగువ, ఎం.కొత్తవలస గ్రామాల్లో ఆయన మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. యూరియా, డీఏపీ అందుబాటులో ఉంచామని చెప్పారు.

పగలూ ఆగని విద్యుత్ దీపాలు



పగటి పూట వెలుగుతున్న విద్యుత్ దీపం

భోగాపురం, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): అమటాంరాయవలస పంచాయతీలోని వీధి దీపాలు పగలు కూడా వెలుగుతూనే ఉన్నాయి. విద్యుత్ అధికారులు స్పందించి, పగటి పూట విద్యుత్ దీపాలు వెలగకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

ఘనంగా నాగార్జున పుట్టినరోజు వేడుకలు

చీపురుపల్లి, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్ర సహకార బ్యాంకు చైర్మన్ కిమిడి నాగార్జున పుట్టినరోజు వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా కిమిడి మిత్ర మండలి సభ్యులు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు, వారి సహాయకులకు అన్నదానం చేశారు. బీవీ గోవిందరాజులు, పనస రవి, ప్రసాద్, కానూరు నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

వ్యాధులు ప్రబలకుండా చూడండి

చీపురుపల్లి, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని డీఎల్‌డీవో హేమసుందరరావు సూచించారు. కరకాం గ్రామంలో ఆయన మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన చెత్త సంపద కేంద్రం, వాటర్ ట్యాంకు, సచివాలయాలను సందర్శించి.. సిబ్బందికి పలు సూచనలు చేశారు. సచివాలయంలో ఈ సేవలు, జీఎస్‌డబ్ల్యూఎస్ తదితర సర్వీసులు పరిశీలించారు. తాగునీటి పంపిణీ వ్యవస్థ పనితీరుపై ప్రజలతో మాట్లాడారు. ఆయన వెంట సచివాలయ సిబ్బంది ఉన్నారు.

మట్టి గణపతి శ్రేయస్కరం

విజయనగరం రింగురోడ్డు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రతిఒక్కరూ మట్టి గణపతి విగ్రహాలను పూజించుకోవడం శ్రేయస్కరమని విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య తెలిపారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్, ఇతర రసాయనాలతో తయారు చేసిన విగ్రహాలు నిమజ్జనం అనంతరం నీటిలో కరగకపోగా.. వాటి రసాయనాలు చెరువులో ఉండే జీవజాతిపై ప్రభావం చూపుతాయని చెప్పారు. అలాగే మండపాల్లో ఎక్కడా ప్లాస్టిక్ వినియోగించవద్దని సూచించారు. వినాయక చవితి పర్యావరణ హితంగా చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

నిరాశ్రయులకు అన్న సమారాధన

దాసన్నపేట, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): మెగాస్టార్ చిరంజీవి పుట్టినరోజు వారోత్సవాల్లో భాగంగా పట్టణ నిరాశ్రయుల వసతిగృహంలో మంగళవారం అన్న సమారాధన నిర్వహించారు. అంజనీ పుత్ర చిరంజీవి వాకర్స్ క్లబ్, అంజని పుత్ర చిరంజీవి బ్లడ్‌డోనర్స్ క్లబ్ అధ్యక్షుడు త్యాడ రామకృష్ణారావు(బాలు) ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. జిల్లా చిరంజీవి యువత ఆర్గనైజింగ్ కార్యదర్శి లాలిశెట్టి రవితేజ, అంజనీపుత్ర చిరంజీవి ప్రజా సేవా సంఘం అధ్యక్షుడు కొయ్యాన లక్ష్మణ్ యాదవ్, అంజనీపుత్ర ఉపాధ్యక్షుడు లోపింటి కళ్యాణ్, మొయిద రాజు పాల్గొన్నారు.

ఘనంగా ఉట్టి సంబరం



ఉట్టి సంబరం నిర్వహిస్తున్న దృశ్యం

నెల్లిమర్ల, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): రామతీర్థం రామస్వామి దేవాలయంలోని వేణుగోపాలస్వామికి శ్రావణ బహుళాష్టమి సందర్భంగా మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామిని పల్లకిలో ఊరేగించారు. అనంతరం అయ్యవార్ల మేడ వద్ద ఘనంగా ఉట్టి సంబరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సహాయ కమిషనర్, కార్యనిర్వహణాధికారి వై.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఎన్నాళ్లీ నరకం?

- చిన్నపాటి వర్షం కురిసినా రోడ్లపై నిలుస్తున్న మురుగు
- కొరవడిన పారిశుధ్య నిర్వహణ
- పలుచోట్ల డ్రైనేజీ కాలువలు లేని వైనం
- ఇదీ రాజాం నగరంలోని దుస్థితి





సప్తగిరి కాలనీలో నిలిచిన మురుగు, మెయిన్‌రోడ్‌పై ఇలా..

రాజాం రూరల్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): నగర వాసులు నరకం అనుభవిస్తున్నారు. చిన్నపాటి వర్షం కురిసినా మెయిన్ రోడ్డు సహా చాలావీధుల్లో మురుగు నీటితో కూడిన వ్యర్థాలు పేరకుపోతున్నాయి. గత ఐదు రోజులుగా కురుస్తున్న వర్షాలతో పరిస్థితి మరింత దారుణంగా మారింది. దీంతో నగరవాసులకు ఇక్కట్లు తప్పడం లేదు. మెంటిపేట ఎస్సీ కాలనీ, గొల్ల వీధి, చాకలి వీధి, రెల్లి వీధి తదితర స్లమ్ ఏరియాలలో పారిశుధ్య నిర్వహణ కొరవడింది. ఆయా వీధుల్లోకి అడుగు పెట్టేందుకు కూడా వీలుకాని పరిస్థితి. బాబానగర్‌లోని నాలుగు లైన్లు, ఈశ్వర నారాయణ కాలనీలోని ఐదు లైన్లలో నేటికీ కాలువలు లేకపోవడంతో వర్షపు నీరంతా రోడ్డుపైనే నిలిచిపోతోంది. మల్లికార్జున కాలనీలోని ఆరులైన్లలో కూడా ఇదే పరిస్థితి. అంబేడ్కర్ జంక్షన్ నుంచి శ్రీకాకుళం రోడ్‌లో కూడా డ్రైనేజీ నిర్మాణం చేయకపోవడంతో కిలోమీటర్ మేర మురుగునీరంతా రహదారిపైనే నిలిచిపోయే పరిస్థితి. చిన్నపాటి వర్షం కురిసినా ఈ మార్గంలోని సప్తగిరి కాలనీ వాసుల వెతలు వర్ణనాతీతం. మురుగునీరంతా ఇళ్లల్లోకి చేరుతోంది. రోడ్డుపైనే మురుగునీరు నిలిచిపోతుండడంతో గృహస్థులు ఇళ్లల్లోకి కూడా వెళ్లేందుకు అవకాశం లేని పరిస్థితి. పట్టణ జనాభాకు అనుగుణంగా పారిశుధ్య సిబ్బందిని పెంచకపోవడంతో ఉన్న సిబ్బందికి నిర్వహణ తలకు మించిన భారంగా మారుతోంది. ఇదిలా ఉంటే పట్టణంలో ఫాగింగ్ చేయకపోవడంతో దోమల సంతతి పెరిగిపోయి ప్రజలు రోగాలబారిన పడి ఆస్పత్రుల పాలవుతున్నారు.

ఎవరైనా అక్కడ నెమ్మదిగా వెళ్లాల్సిందే..



ఎంఆర్‌పేట వద్ద నెమ్మదిగా వెళ్తున్న కలెక్టర్ కారు

రేగిడి, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): పాలకొండ- విశాఖ మార్గంలోని రాజాం రూట్‌లో మజ్జిరామునిపేట వద్ద దాదాపు 200 మీటర్ల రోడ్డు పూర్తిగా పాడయ్యింది. ఇటీవల వర్షాలకు రహదారిలోని గుంతల్లో నీరుచేరి ప్రమాదకరంగా మారింది. ఈ రూట్లో వర్షం పడే సమయంలో ఎవరు ప్రయాణించాలన్నా హడలెత్తిపోతున్నారు. మంగళవారం రేగిడి మండలం పర్యటనకు వచ్చిన కలెక్టర్ అంబేడ్కర్‌కు ఇదే పరిస్థితి వచ్చింది. కలెక్టర్ కారుకు ఇక్కడకు వచ్చేసరికి బ్రేక్ పడింది. పక్క నుంచి నెమ్మదిగా వెళ్లాల్సి వచ్చింది.

వినాయక చవితి ఉత్సవాలకు అనుమతి తప్పనిసరి

నెల్లిమర్ల, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): మండలంలో అన్ని గ్రామాలకు, నగర పంచాయతీకి వినాయక చవితి ఉత్సవాలకు మైక్ అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని ఎస్ఐ బి.గణేష్ తెలిపారు. నెల్లిమర్ల పోలీసు స్టేషన్‌లో మహిళా పోలీసులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండపాల ఏర్పాటుకు ముందుగా పోలీసుల అనుమతి తీసుకోవాలన్నారు. ప్రజలకు ఇబ్బంది కలిగించే శబ్దాలు, డీజేలు మండపం వద్ద, ఊరేగింపులో నిషేధమన్నారు. అలాగే మందుగుండు సామగ్రి, అశ్లీల నృత్యాలు చేయరాదని తెలిపారు. నిబంధనలు ఉల్లంగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఆక్రమణలపై దృష్టి సారిస్తాం

కొత్తవలస, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): ఆక్రమణలకు గురవుతున్న గెడ్డలు, చెరువులపై దృష్టి పెడుతున్నామని కొత్తవలస తహసీల్దార్ పి.అప్పలరాజు తెలిపారు. ఇటీవల రెండు రోజులు కురిసిన వర్షాలు కారణంగా గెడ్డలలో నుంచి వెళ్లాల్సిన నీరు రోడ్ల మీదకు వచ్చిందన్నారు. కొత్తవలసలో వీరసాగరం చెరువుకు సంబంధించిన కాలువలతో పాటు, కొత్తవలస డాబాలు గెడ్డలో ఆక్రమణలు ఉన్నాయని చెప్పారు. గెడ్డ ఆక్రమణ చేయడం వల్లే నీరు రోడ్డు మీదకు వచ్చిందన్నారు. కొత్తవలస పంచాయతీ పరిధిలో ఉన్న వీఆర్వోలందరూ ఆక్రమణలపై దృష్టి సారించి తనకు నివేదిక ఇవ్వాలని ఆయన సూచించారు. ఆక్రమణదారులందరికీ నోటీసులు జారీ చేస్తామని చెప్పారు. ఎక్కడ ఆక్రమణలు చేస్తున్నారో ప్రజలు కూడా తమకు ఫిర్యాదులు చేయాలని కోరారు.

అక్రమ ఆశీలు వసూలుపై చర్యలు

పూసపాటిరేగ, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): పూసపాటిరేగలో చేపల మార్కెట్, సిమెంట్ గొడౌన్‌లు.. తదితర వాణిజ్య కూడళ్ల వద్ద కొందరు ప్రైవేటు వ్యక్తులు అక్రమంగా ఆశీలు వసూలు చేస్తున్నట్టు ఫిర్యాదులు వచ్చాయని, వీటికి పంచాయతీకి ఎటువంటి సంబంధం లేదని స్థానిక సర్పంచ్ టొంపల సీతారాం స్పష్టంచేశారు. మంగళవారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. అక్రమ ఆశీలు వసూలుపై అందిన ఫిర్యాదు మేరకు పంచాయతీ తరఫున చర్యలు తీసుకుంటామన్నారు. ఈ విషయాన్ని మండల పంచాయతీ అధికారి దృష్టికి తీసుకు వెళ్లామని చెప్పారు.

సమస్యలకు పరిష్కారం చూపండి

శృంగవరపుకోట, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల సమస్యలకు పరిష్కారం చూపాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం స్థానిక తహసీల్దార్ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందించారు. అంతకుముందు విశాఖ-అరకు రోడ్డులో ర్యాలీ నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ నాయకులు రత్న, చరణ్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్.కోట నియోజకవర్గ అభివృద్ధికి సహకరించండి

- విశాఖ మేయర్‌కు ఎమ్మెల్యే లలితకుమారి వినతి

శృంగవరపుకోట/ లక్కవరపుకోట, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): ఎస్.కోట నియోజకవర్గంలో కొన్ని గ్రామాలు విశాఖ జిల్లాతో ముడిపడి ఉండడంతో పలు అభివృద్ధి కార్యక్రమాలు ఆగిపోతున్నాయని అందుకు తమకు సహకరించాలని కోరుతూ ఎమ్మెల్యే లలితకుమారి దంపతులు.. విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ పీలా శ్రీనివాసరావుకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. కొత్తవలస-దేవరాపల్లి రోడ్డు పనులకు నిధులు కేటాయించాలని కోరారు. బానాది-బల్లంకి మార్గంలో శ్లాబ్ పనులకు, కృష్ణాపురం చుట్టుపక్కల గ్రామాల రోడ్లకు సుమారు రూ.2.50 కోట్లు కేటాయించాలని కోరారు. అలాగే రైవాడ నీటి పథకం చుట్టు ఉన్న గ్రామాల రోడ్ల అభివృద్ధికి సహకరించాలని అడిషనల్ డైరెక్టరేట్ కమిషనర్ వర్మకు అంచనా విలువలతో కూడిన వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి కేబీపీ రాంప్రసాద్, కరెడ్ల ఈశ్వరరావు, కొట్యాడ రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.



విశాఖ మేయర్ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందిస్తున్న ఎస్.కోట ఎమ్మెల్యే లలితకుమారి

గాంధీ పార్కులో నిలిచిన అభివృద్ధి పనులు

విజయనగరం రూరల్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): విశాఖ రీజయన్ మెట్రోపాలిటిన్ డెవలప్‌మెంట్ అథారిటీ (వీఎంఆర్‌డీఏ) విడుదల చేసిన నిధులతో గాంధీ పార్కులో చేపడుతున్న అభివృద్ధి పనులకు బ్రేక్ పడింది. గాంధీ పార్కు ప్రహరీ నిర్మాణానికి సంబంధించి పనులు ప్రారంభమయ్యాయి. 30 ఏళ్ల కిందట కట్టిన ప్రహరీ ఒక వైపు పడిపోతుంటే, అదే గోడపై తిరిగి నిర్మాణం చేపట్టడంతో పార్కు అభివృద్ధి కమిటీ ప్రతినిధులు ఈ పనులను మంగళవారం అడ్డుకున్నారు. అదే విధంగా పార్కులో వివిధ మొక్కలు పెంపకానికి, ఇతర అవసరాలకు గాను కొత్త బోరు వేయాల్సి ఉంది. అలా కాకుండా పాత బోరునే మరమ్మతులు చేసి వినియోగించడాన్ని పార్కు అభివృద్ధి కమిటీ వ్యతిరేకిస్తున్నది. ఇదే విషయాన్ని ఈనెల 16న ఎమ్మెల్యే అదితి గజపతిరాజు దృష్టికి కూడా తీసుకువెళ్లారు. పార్కు ప్రహరీ పటిష్టంగా నిర్మించాలని, కొత్త బోరును వేయాలని పార్కు కమిటీ ప్రతినిధులు కోరుతున్నారు.



ప్రహరీ నిర్మాణంలో నాణ్యత లేదంటూ ఆరోపిస్తున్న పార్కు కమిటీ ప్రతినిధులు

గుంతలు పూడ్చి.. ట్రాఫిక్ నియంత్రించి

విజయనగరం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): గత రెండు రోజుల నుంచి జిల్లా కేంద్రంలో కురిసిన వర్షాల కు రోడ్లు ఛిద్రమయ్యాయి. అనేక చోట్ల గుంతలమయంగా మారాయి. గూడ్స్‌షెడ్స్ వద్దగల డీఎస్పీ కార్యా లయానికి వెళ్లే మార్గంలో భారీగా గుంతలు పడటంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. దీంతో ద్విచక్ర వాహన చోదకులు తీవ్రఇబ్బందులు పడ్డారు. అక్కడ విధులు నిర్వహిస్తున్న ఓ ట్రాఫిక్ కానిస్టేబుల్ గుంతల వల్లే ట్రాఫిక్ అంతరాయమని గమనించారు. వెంటనే జోరువర్షాన్ని సైతం లెక్క చేయకుండా.. దగ్గరలో ఉన్న మట్టిరాళ్లను తీసుకొచ్చి రోడ్డుపైన ఉన్న గుంతలను పూడ్చారు. దీంతో ట్రాఫిక్ క్లియర్ అయ్యింది. ఎవరో వస్తారని.. ఏదో చేస్తారని ఎదురు చూడకుండా తానే స్వయం వర్షంలో గుంతల పూడ్చి ట్రాఫిక్ ఇబ్బందుల కు చెక్‌పెట్టిన కానిస్టేబులను వాహనదారులు అభినందించారు.



గుంతలు కప్పుతున్న ట్రాఫిక్ కానిస్టేబుల్

ఫొటో జర్నలిజంతో సామాజిక మార్పు

విజయనగరం టౌన్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): ఫొటో జర్నలిజంతో సామాజిక మార్పు కలుగుతుందని కెనడాలో థాంప్సన్ రివర్స్ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ బాల నిక్కు అన్నారు. ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా స్థానిక ఏపీ కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయంలో జర్నలిజం విభాగం, సోషల్ విభాగం ఆధ్వర్యంలో ఫొటో జర్నలిజం ఫర్ రెసిలియంట్ కమ్యూనిటీస్ అనే అంశంపై మంగళవారం సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ఆయన మాట్లాడుతూ ఫొటో జర్నలిజం సామాజిక మార్పు, చైతన్యం కల్పన, కమ్యూనిటీ రెసిలియెన్స్ బలోపేతంలో పోషించే కీలకపాత్రను వివరించారు. యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ టి.శ్రీనివాసన్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జితేంద్రమోహన్‌మిశ్రా, స్కూల్ ఆఫ్ హ్యూమనిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ ప్రొఫెసర్ ఎం.శరత్‌చంద్రబాబు, కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినేషన్ ప్రొఫెసర్ దీపక్‌మోహనరావు షిండే తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రొఫెసర్ బాలనిక్కు

ఘనంగా ఫొటోగ్రఫీ దినోత్సవం

రాజాం రూరల్: రాజాంలో ఫొటోగ్రాఫర్ల యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం నిర్వహించారు. లూయిస్ డాగ్యురే చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఇటీవల మృతిచెందిన ఫొటోగ్రాఫర్ కుటుంబానికి రూ.13వేలు అందజేశారు. ఫొటోగ్రఫీ యూనియన్ రాష్ట్ర నాయకుడు సుంకరపల్లి సతీష్, తదితరులు పాల్గొన్నారు.

కుంగిన కల్వర్టు

సంతకవిటి, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): గత మూడు రోజులుగా వర్షాలు కురుస్తుండడంతో మండలంలోని రాజాం-సంతకవిటి ప్రధాన రహదారిలో గరికపాడు గ్రామం వద్ద ఉన్న కల్వర్టు కుంగిపోయి, పెద్ద గుంత ఏర్పడింది. దీంతో గ్రామస్థులు ఆ గుంత వద్ద కర్ర పాతి ఎర్రటి చీరను చుట్టారు. అధికారులు స్పందించి ఈ కల్వర్టును బాగుచేసేలా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.



గరికపాడు సమీపంలో కుంగిన కల్వర్టు



ర్యాలీ చేస్తున్న జిందాల్ నిర్వాసితులు

మా భూములు ఇవ్వండి

- జిందాల్ నిర్వాసితుల నిరసన

ఎస్.కోట రూరల్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): జిందాల్‌కు గ్రామ సభల ద్వారా కేటాయించిన భూములు కాకుండా వేరే భూములను అక్రమంగా రిజిస్ట్రేషన్ చేశారని, ఇది తగదని జిందాల్ నిర్వాసితులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు బొడ్డవర గ్రామంలో మంగళవారం వారు నిరసన చేపట్టారు. తమ భూములు తమకు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

పాడైన కల్వర్టులను పట్టించుకోరా?

- రసాభాసగా గంట్యాడ సర్వసభ్య సమావేశం

గంట్యాడ, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ పీరుబండి హైమావతి అధ్యక్షతన మంగళవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశం సరసాభాసగా సాగింది. ఆర్‌అండ్‌బీ జేఈ సమావేశానికి హాజరు కాకపోవడంతో సభ్యులు అసహనం వ్యక్తం చేశారు. మండలంలో చాలా కల్వర్టులు పూర్తి దెబ్బతిన్నాయని, దీంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుని వెళ్తామని ఎంపీడీవో రమణమూర్తి తెలిపారు. పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం నిధులు గత 14 నెలలు నుంచి విడుదల కాకపోవడంపై పలువురు ప్రశ్నించారు. అలాగే దివ్యాంగుల పింఛన్ల నిలిపివేతపై ప్రశ్నించారు. దీనిపై ఎంపీడీవో మాట్లాడుతూ నోటీసులు అందుకున్న పింఛనదారులు ఆపీల్ చేసుకుంటే తమ లాగిన్ నుంచి డీఆర్‌డీఏ పీడీ లాగిన్‌కు పంపిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ సురేష్‌బాబు, గజపతినగరం మార్కెట్ కమిటీ చైర్మన్ గోపాలరాజు, జడ్పీటీసీ సభ్యులు వర్రి నర్సింహమూర్తి, తహసీల్దార్ నీలకంఠేశ్వరరెడ్డి, మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



సమావేశంలో ప్రశ్నిస్తున్న సభ్యులు

అగ్నివీర్ ర్యాలీలో అపశ్రుతి

- కుప్పకూలిన జిల్లా యువకుడు.. చికిత్స పొందుతూ మృతి



సాయికిరణ్ (ఫైల్)

సంతకవిటి, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): అగ్నివీర్ ఎంపికల్లో భాగంగా కాకినాడలో నిర్వహించిన ర్యాలీలో అపశ్రుతి చోటు చేసుకుంది. విజయనగరం జిల్లాకు చెందిన యువకుడు మృతి చెందాడు. సంతకవిటి మండలం శ్రీహరినాయుడుపేట గ్రామానికి చెందిన గండ్రేటి సాయికిరణ్(19) కాకినాడలో నిర్వహిస్తున్న అగ్నివీర్ ర్యాలీలో పాల్గొన్నాడు. మంగళవారం రన్నింగ్ చేస్తుండగా మైదానంలోనే కుప్పకూలిపోయాడు. వెంటనే కాకినాడలోని జీజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ సాయంత్రం 4గంటలకు మృతిచెందాడు. విషయం తెలుసుకున్న సాయికిరణ్ తల్లిదండ్రులతో పాటుగా చెల్లి శ్రీలేఖ కన్నీరు మున్నీరవుతున్నారు.

గడ్డి కోతకు వెళ్లి.. విగత జీవిగా మారి



జగన్నాథం (ఫైల్)

భామిని, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దిమ్మిడిజోల గ్రామానికి చెందిన గిరిజనుడు పత్తిక జగన్నాథం(44) మంగళవారం గడ్డికోతకు వెళ్లి విగత జీవిగా మారాడు. బత్తిలి పోలీసుల కథనం మేరకు.. జగన్నాథం పొలం బట్టి వద్దకు మంగళవారం గడ్డికోతకు వెళ్లాడు. కొంతసేపటి తర్వాత స్థానికులు జగన్నాథం మృతదేహాన్ని బట్టి వద్ద గుర్తించారు. అనంతరం సమాచారం తెలు సుకున్న పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. నీటిలో మునిగి గాని, ఏ విష పురుగు కాటువేసి చనిపోయి ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు. ఈ మేరకు జగన్నాథం భార్య వనజాక్షి నుంచి స్టేట్‌మెంట్ తీసుకొని కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పాలకొండ ఏరియా ఆసుపత్రికి శవ పంచనామాకు తరలించారు. కాగా జగన్నాథం కుటుంబ సభ్యులకు సంబంధించి మంగళవారం రాత్రి నూతన గృహప్రవేశం నిర్వహించనున్నారు. ఇంతలో జగన్నాథం మృతిచెందడంతో బంధువులు, గ్రామస్థులు విషాదంలో మునిగిపోయారు.

ట్యాంకర్‌ను ఢీకొన్న ఆర్టీసీ బస్సు

- పలువురికి గాయాలు



బస్సు ముందు భాగం నుజ్జయిన దృశ్యం

పూసపాటిరేగ, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలో పేరాపురం వద్ద జాతీయ రహదారిపై ఆగి ఉన్న ట్యాంకర్ లారీని శ్రీకాకుళం నుంచి విశాఖపట్నం వెళ్తున్న ఆర్టీసీ బస్సు వెనుక నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో బస్సు ముందు భాగం నుజ్జయ్యింది. బస్సులో ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. వీరిని సమీపంలోని సుందరపేట సీహెచ్‌సీకి తరలించి, చికిత్స చేశారు. అదపాక బంగారమ్మ అనే ప్రయాణికురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నమోదు చేసినట్టు ఎస్ఐ దుర్గాప్రసాద్ తెలిపారు. బస్సు డ్రైవర్ నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేయడం వల్లే ఈ ప్రమాదం సంభవించినట్టు పోలీసులు తెలిపారు.

రెండు బైకులు ఢీ.. ముగ్గురికి గాయాలు

బొబ్బిలి రూరల్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని నారసింహునిపేట సమీపంలోని మంగళవారం సాయంత్రం రెండు బైకులు ఢీకొని ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. మక్కువ నుంచి మర్రాపు జానకిరాము అనే వ్యక్తి బైకుపై సీహెచ్ బొడ్డవలస వస్తున్నాడు. అదే సమయంలో బొబ్బిలి నుంచి మక్కువ వైపు కొల్లి పోలీసు, కొల్లి శివ బైకుపై వస్తున్నారు. ఈ రెండు వాహనాలు ఎదురెదురుగా ఢీకొనడంతో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానికులు ఆటోపై బొబ్బిలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

గంజాయితో వ్యక్తి అరెస్టు

గజపతినగరం, ఆగస్టు19 (ఆంధ్రజ్యోతి): మరుపల్లి గ్రామానికి చెందిన పారాది మోహన్‌మురళీకృష్ణ గంజాయి అమ్మకాలు చేపడుతున్నట్టు అందిన సమాచారం మేరకు సిబ్బంది సహాయంతో దాడి చేసి, పట్టుకున్నామని సీఐ రమణ తెలిపారు. మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆయన దీనికి సంబంధించి వివరాలు వెల్లడించారు. మరుపల్లి గ్రామానికి చెందిన పారాది మోహన్‌మురళీకృష్ణ అదే గ్రామానికి చెందిన పల్లి నవీన్‌తో కలిసి ఒడిశా రాష్ట్రం నుంచి గంజాయి తీసుకువచ్చి విజయనగరం రైల్వే స్టేషన్‌లో గుర్తు తెలియని వ్యక్తులకు అధిక ధరకు అమ్ముతున్నట్టు తమకు సమాచారం వచ్చిందన్నారు. ఈ మేరకు నిఘా పెట్టామని తెలిపారు. ఈక్రమంలో సోమవారం మరుపల్లి గ్రామంలో రైస్ మిల్లు వద్ద ఉన్న మోహన్‌మురళీకృష్ణను పట్టుకుని, 1.30 కేజీల గంజాయి ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. నిందితుడిపై కేసు నమోదు చేసి, అరెస్టు చేశామని తెలిపారు. మరో నిందితుడు పల్లి నవీన్ పరారీ కావడంతో ప్రత్యేక బృందం ఏర్పాటు చేశామన్నారు. ఈ సమావేశంలో ఎస్ఐ కిరణ్‌కుమార్ నాయుడు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సారా స్వాధీనం

కొమరాడ, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): గుమడ గ్రామ పరిసర ప్రాంతాలకు చెందిన ఇద్దరు వ్యక్తులు నుంచి 20 లీటర్ల సారాను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు ఎస్ఐ కె.నీలకంఠం ఆధ్వర్యంలో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. వీరిద్దరినీ పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చి, కేసు నమోదు చేశారు.

దెప్పూరులో అధికారుల విచారణ

ఎస్.కోట రూరల్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): తమకు తెలియకుండా జిందాల్ యాజమాన్యం తమ భూములను, ఇళ్లను రిజిస్ట్రేషన్ చేసుకుందని, తమ ఊరును తమకు తెలియకుండా మాయం చేసిందని కొద్ది రోజుల కిందట కిల్తంపాలెం పంచాయతీ దెప్పూరు గిరిజనులు కలెక్టర్ గ్రీవెన్స్‌లో ఫిర్యాదుచేశారు. ఈమేరకు మంగళవారం స్థానిక తహసీల్దార్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సర్వేయర్ రామ, ఆర్ఐ మనోజ్ తదితరులు గ్రామానికి వెళ్లారు. ఈసందర్భంగా అక్కడ ఉన్న గిరిజనులు మాట్లాడుతూ తమ తాతతండ్రుల కాలం నుంచి ఇక్కడే బతుకుతున్నామని కొద్ది రోజుల కిందట కొంతమంది వచ్చి ఈ భూమి జిందాల్‌కు ఇచ్చేశారని చెప్పడంతో ఆశ్చర్యపోయామన్నారు. ఈ భూమి జిందాల్‌కు ఇస్తే ఇక్కడ కట్టుకున్న తమ ఇళ్లకు పట్టాలు, ప్రధానమంత్రి ఆవాస్ యోజన, ఇతర పథకాలు ఎలా వచ్చాయని ప్రశ్నించారు. తమను ఇక్కడ నుంచి ఖాళీ చేయించొద్దని వేడుకున్నారు. ఈ విషయంపై తహసీల్దార్ మట్లాడుతూ సర్వే నెంబర్ 146/4లో నివేదిక ఇవ్వాలని వచ్చిన ఆదేశాల మేరకు పరిశీలన చేశామని, నివేదిక కలెక్టర్‌కు అందిస్తామని తెలిపారు.

నూతన బార్ విధానంతో నష్టం

విజయనగరం క్రైం, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన మద్యం పాలసీతో నష్టపోతామని వైన్స్ అండ్ బార్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ఉపాధ్యాక్షులు సీతారామయ్య, పాకలపాటి సన్యాసిరాజు తెలిపారు. మంగళవారం విజయనగరంలోని ఓ ప్రైవేటు హోటల్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడారు. దరఖాస్తు చేయాలంటే రూ.5లక్షలు నాన్ రిఫండబుల్ చెల్లించాల్సి ఉందని, మరో వైపు బార్‌కు కనీసం నాలుగు దరఖాస్తులు వస్తేనే లాటరీ విధానం చేస్తామని షరతు విధించిందన్నారు. అలాగే వైన్ షాపుల వద్ద పర్మిట్ రూంలను అనుమతులు ఇవ్వనున్నట్టు ప్రకటించడంతో తమలో ఆందోళన వ్యక్తమవుతున్నదన్నారు. గత ఏడాది పాలసీతోనే సుమారు రూ.30లక్షలు నష్టపోయామని.. ఈ విధానంతో మరింత నష్టపోయే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తంచేశారు. దీంతో తాము దరఖాస్తు చేసుకునేందుకు ముందుకు రాలేమన్నారు. సమావేశంలో అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎస్పీ దృష్టికి వయోశ్రేష్ఠుల సమస్యలు



ఎస్పీ వకుల్ జిందాల్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

విజయనగరం క్రైం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): వయోశ్రేష్ఠుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎస్పీ వకుల్ జిందాల్ హామీ ఇచ్చారని ఆ సంఘం జిల్లా శాఖ అసోసియేషన్ ప్రెసిడెంట్ బి.జగన్నాథరావు తెలిపారు. మంగళవారం ఎస్పీని కలిసి వయోశ్రేష్ఠుల సమస్యలపై వినతిపత్రం అందజేశామని ఆయన చెప్పారు. సీనియర్ సిటిజెన్స్ ప్రాణ, ఆస్తి సంరక్షణ కోసం చర్యలు చేపట్టాలని, తల్లిదండ్రులు వృద్ధుల పోషణ, సంక్షేమ నియమావళిని సరిగా అమలు జరిగేలా చూడాలని కోరామన్నారు. ప్రతి పోలీసుస్టేషన్ పరిధిలో సీనియర్ సిటిజన్స్ సంఘ ప్రతినిధులతో కమిటీలు ఏర్పాటు చేయాలని, వారి ఫిర్యాదులు సత్వరమే పరిష్కరించాలని కోరినట్టు తెలిపారు. తమకు తగిన భద్రత కల్పించేందుకు తక్షణ చర్యలు చేపడతామని ఎస్పీ హామీ ఇచ్చారని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా వయోశ్రేష్ఠుల సంక్షేమ సంఘం మాజీ ప్రధాన కార్యదర్శి టి.సత్యమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా అభివృద్ధికి సహకరిస్తా

● బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్


శ్రీమేధా దక్షిణామూర్తి విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొన్న మాధవ్

పార్వతీపురం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి):జిల్లా అభివృద్ధికి పూర్తిస్థాయిలో సహకరిస్తానని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ తెలిపారు. మంగళవారం పార్వతీపురంలోని ఎన్జీవో హోంలో మేధావులతో బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి శ్రీనివాసరావు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలోఏపీఎన్జీవో సంఘం జిల్లా అధ్యక్షుడు జీవీఆర్.ఎస్.కిషోర్, పీఆర్టీయూ అసోసియేట్ అధ్యక్షుడు అమరాపు సూర్యనారాయణ, న్యాయవాది జోగారావు, సొండి సంజీవి, భాస్కరరావు పాల్గొన్నారు.

మేధా దక్షిణామూర్తి ప్రతిష్ఠ

పార్వతీపురం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురంలోని సర్వమంగళా దేవి పీఠంలో మేధా దక్షిణామూర్తి విగ్రహాన్ని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించారు. అనంతరం అమ్మవారితోపాటు పీఠం ప్రాంగణంలో కొలువైన దేవతలు, వైభవ వేంకటేశ్వరస్వామికి పూజలుచేశారు. కార్యక్రమంలో పీఠాదిపతి కాళిదాసుశర్మ,బ్రహ్మగ్రూప్ అధినేత బ్రహ్మనాయుడు పాల్గొన్నారు.

ఆటోడ్రైవర్లకు ఆర్థిక సాయం అందించండి

పాలకొండ, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి):ఆటో డ్రైవర్లకు ఆర్థిక సాయం చేయాలని ఏపీ ఆటో అండ్ ట్రాలీ డ్రైవర్ల యూనియన్ పాలకొండ ప్రాంతం కమిటీ డిమాండ్‌చేసింది. మంగళవారం పాలకొండలో ఆటో కార్మిక సంఘాల కమిటీ సమావేశం నిర్వహించారు.కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దావాల రమణారావు, కాద రాము, పి.శేఖర్, పి.మహేష్, డి.దుర్గారావు, కె.శ్రీను, మహేష్, బి.ప్రసాద్, ఎన్.రాంబాబు, పి.సాయికుమార్, పి.గౌరీశ్వరరావు, పి.రామారావు, శంకర రావు, శ్రీను, రామారావు, సాయి పాల్గొన్నారు.

శ్రీవరి పద్ధతిలో నాట్లు వేసుకోవాలి

గుమ్మలక్ష్మీపురం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి):రైతులు శ్రీవరి విధానం ద్వారా నాట్లు వేసుకోవాలని జీవా ప్రాజెక్టు కోఆర్డినేటర్ జి.ప్రభోదు తెలిపారు. మంగళవారం మండలంలోని బుడ్డెంఖర్జలో జీవ రైతు పేకాపు మురళి వ్యవసాయ క్షేత్రంలో నవధాన్యాలు సాగుచేసిన నేలలో వరుసల్లో వరినాట్లు వేసే కార్య క్రమాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో జట్టు ట్రస్టు కోఆర్డినేటర్ ఎం.నూకంనాయుడు, జి.మురళీమోహన్, జి.గోవిందరావు పాల్గొన్నారు.

సీఆర్టీలకు ఉద్యోగ భద్రత కల్పించాలి

బెలగాం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): సీఆర్టీలకు ఉద్యోగ భద్రత కల్పించాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.మురళీమోహన్ కోరారు. మంగళవారం పార్వతీపురంలోని కలెక్టరేట్ ఎదుటనిరసన తెలిపారు.ఈసందర్భంగా మురళీమోహన్ మాట్లాడుతూ సీఆర్టీలకు రెండు నెలలుగా జీతాల బకాయి వేతనాలు చెల్లించాలని డిమాండ్‌చేశారు.

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

సీతంపేట రూరల్,ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి):విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సీతంపేట ఎస్ఐ వై.అమ్మనరావు సూచించారు. స్థానిక ఏపీఆర్ బాలుర గురుకుల కళాశాలలో శక్తి యాప్,డ్రగ్స్ నిషేధం, పోక్సో, సైబర్‌క్రైమ్, ఈవ్‌టీజింగ్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

● కొమరాడ, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి):కొమరాడ కస్తూరిబాగాంధీ పాఠశాలలో శక్తిటీం, ఎస్ఐ కె.నీలకంఠం బాలికలకు మహిళలపై అవాంఛనీయ సంఘటనలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు.

400 ఎకరాల్లో వరి పైరు ముంపు

గరుగుబిల్లి, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి):మండలంలోని రావుపల్లి దేసూరిగెడ్డ ప్రాంతంలో ముంపునకు గురైన పంటపొలాలను మంగళవారం ఉప తహసీల్దార్ మారుతీరావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ గౌరీప్రసాదరావు, ఏవో జ్యోత్న్న పరిశీలించారు. ఈ సందర్భంగా సర్పంచ్ బొంతాడ మహేశ్వరరావు కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు గెడ్డలో అధికంగా వరద ప్రవాహం చేరడంతో 400 ఎకరాల వరి పంట ముంపునకు గురైందని వివరించారు.

●సాలూరు రూరల్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): వర్షాలు పడే అవకాశమున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలనిసాలూరు తహసీల్దార్ బి.నీలంకఠరావు కోరారు. మంగళవారం దండిగాం కాజ్‌వే వద్ద సువర్ణముఖి వరద ప్రవాహాన్ని పరిశీలించారు. ఇక్కడ సోమవారం సాయంత్రం వరద పెరగడంతో40 గ్రామాలకు రాకపోకలకు ఇబ్బంది కలిగిన విషయం విదితమే.మామిడిపల్లి తదితర చోట్ల నదుల ప్రవాహాన్ని పరిశీలించారు.

రోగులకు అందుబాటులో ఉండాలి

గరుగుబిల్లి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాల పరిధిలోని వైద్య సిబ్బంది రోగులకు అందుబాటులో ఉండాలని జిల్లా ఉప వైద్యాధికారి కేవీఎస్ పద్మావతి సూచించారు. మంగళవారం చినగు డబ, ఉద్దవోలు పరిధిలోని ఉప కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు వ్యాధుల బారినపడే అవకాశం ఉండడంతో అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. అనంతరం పలు రకాల రికార్డులను పరిశీలించారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

సాలూరు, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): వర్షాలు కురుస్తుండడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాలకృష్ణ కోరారు. మంగళవారం మునిసిపాలిటీలోని 11వ వార్డులోని చిన్నవీధిలో సిబ్బందితో కలిసి వెళ్లి వర్షాకాలం వ్యాధులకు గురికాకుండా జాగ్రత్తలను వివరించారు.

ఫొటోగ్రాఫర్ల సంఘ అధ్యక్షుడిగా అజిత్‌కుమార్

బెలగాం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : పార్వతీపురంలో ఫొటో అండ్ వీడియో గ్రాఫర్ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ప్రపంచ ఫొటో గ్రాఫర్ల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఎన్జీవో భవనంలో జరిగిన కార్యక్రమంలో కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బి.అజిత్‌కుమార్, ఉపాధ్యక్షుడు ఇ.దుర్గాప్రసాద్, ప్రధానకార్యదర్శిగా ముఖేష్, సంయుక్త కార్యదర్శిగా శ్రావణ్ కుమార్, ట్రెజరర్‌గా చక్రవర్తిలను ఎన్నుకున్నారు.

మండపాలకు అనుమతి తప్పనిసరి

సాలూరు, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): వినయక మండపాలకు తప్పనిసరిగా పోలీసుల అనుమతి పొందాలని పట్టణ సీఐ అప్పలనాయుడు తెలిపారు. మంగళవారం సాలూరులో విలేకరులతో మాట్లాడుతూ ఉత్సవ కమిటీ సభ్యులు తప్పనిసరిగా మండపాలు ఏర్పాటు చేసే ప్రదేశాలు, ఉత్సవాలు జరిపే తేదీలు, నిమజ్జనం జరిపే తేదీలు పూర్తి వివరాలతో కూడిన సమాచారాన్ని ముందస్తుగా పోలీసువారికి అందజేయాలని కోరారు.

● జియ్యమ్మవలస, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): గణేష్ ఉత్సవాలు నిర్వహించే కమిటీలు నిబంధనలు పాటించాలని చినమేరంగి సర్కిల్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ టీవీ తిరుపతిరావు తెలిపారు. మంగళవారం చినమేరంగిలో విలేకరులతో మాట్లాడుతూ గ్రామాల్లో పోలీసుల అనుమతి లేకుండా విగ్రహాలను ఏర్పాటుచేయరాదని చెప్పారు. ఉత్సవాల్లో భాగంగా మండపాల్లో డీజేలు, పేలుడు పదార్థాలు వినియోగించరాదని తెలిపారు.

ఈ-పంట నమోదు చేసుకోవాలి

సాలూరురూరల్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి):రైతులు తాము సాగు చేస్తున్న పంటల వివరాలను ఈ పంటలో నమోదు చేసుకోవాలని సాలూరు ఏవో కె.శిరీష పిలుపునిచ్చారు. మంగళవారం పెదబోరబందలో పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో రస్తాకుంటుభాయి కేవీకే సబ్జెక్ట్‌మేటర్ స్పెషలిస్ట్ అమృతవీణ, అను పాల్గొన్నారు.

ఎరువులు సకాలంలో పంపిణీచేయాలి

కురుపాం రూరల్ 19 ఆగస్టు (ఆంధ్రజ్యోతి): మొండెంఖల్ గ్రామ సచివాలయానికి వచ్చిన ఎరువులు సకాలంలో పంపిణీచేయాలని సర్పంచ్ ఇంటి కుప్పల గౌరీ శంకరరావు ఒక ప్రకటనలో కోరారు. డీఏపీని సిబ్బంది అధిక ధరకుమార్కెట్‌లో అమ్ముకుంటున్నారని ఆరోపించారు. సచివాలయానికి శుక్ర వారం 200 బస్తాల డీఏపీ వచ్చిందని తెలిపారు. కాగా డీఏపీ పక్కదారి పట్టలేదని ఏవో నాగేశ్వరరావు తెలిపారు.

పిల్లర్లు పాడై.. శ్లాబు పెచ్చులూడి

● బిక్కుబిక్కుమని విధులు నిర్వహిస్తున్న సిబ్బంది
● చిన్నపాటి వర్షానికే తడిచిపోతున్న సామగ్రి
● ఇదీ జియ్యమ్మవలస మండల పరిషత్ కార్యాలయం పరిస్థితి


వర్షానికి తడవకుండా ఫ్లెక్సీతో కంప్యూటర్లు కప్పిన దృశ్యం

జియ్యమ్మవలస, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): జియ్యమ్మవలస మండల పరిషత్ కార్యాలయం శిథిలావస్థకు చేరుకుంది. పిల్లర్లు పూర్తిగా పాడయ్యాయి. శ్లాబు పెచ్చులూడుతోంది. దీంతో కారిపోతుండడంతో కంప్యూటర్లకు, ఇతర విలువైన పరికరాలు తడిచిపోతున్నాయి. ఈ నేపథ్యంలో సిబ్బంది బిక్కుబిక్కుమని విధులు నిర్వహిస్తున్నారు.

జియ్యమ్మవలస మండలపరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయం 1995-96లో నిర్మించారు. ఈ తర్వాత కనీస మరమ్మతులకు నోచుకోలేదు. దీంతో పైన పటారం లోన లొటారం అన్న సామెత మాదిరిగా బయటకు భవనం బాగానే కనబడుతున్నా లోపల భాగంలో కాంక్రీట్ పిల్లర్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. శ్లాబుపై నుంచి నీరు చిమ్ముతుండడంతో వర్షం కురిస్తే లోపలి సామగ్రి తడిచిపోతున్నాయి. దీంతో ఫ్లెక్సీలు, పరదాలతో కంప్యూటర్లు, రికార్డులను కప్పాలి వస్తోంది. చిన్నపాటి వర్షం కురిసినా గదులు, వరండా వర్షం నీరుచేరుతోంది. ఈ నేపథ్యంలో నూతన భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయడానికి సంబంధిత అధికారుల ద్వారా, ఎంపీపీ ద్వారా ప్రతిపాదించినా ఉమ్మడి విజయనగరం జిల్లా జడ్పీ అధికారులు చర్యలు తీసుకోవడం లేదన్న విమర్శలొస్తున్నాయి. కాగా మండలపరిషత్ కార్యాలయం విషయంపై గతంలో పలుమార్లు జిల్లా పరిషత్ సీఈవోకు లేఖలు రాసినట్లు జియ్యమ్మవలస ఎంపీడీవో కర్రి ధర్మారావు తెలిపారు. భవనం దారుణంగా ఉన్న విషయం ఉన్నతాధికారుల దృష్టిలో ఉందని చెప్పారు.


పెచ్చులూడిన పిల్లర్

రహదారుల నిర్మాణానికి ప్రాధాన్యం

●కురుపాం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి


జగదీశ్వరికి వినతిపత్రం అందజేస్తున్న మధుసూదనరావు

గుమ్మలక్ష్మీపురం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో రహదారుల నిర్మాణానికి అధిక ప్రాధాన్యతనిస్తోందనికురుపాం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి తెలిపారు.మంగళవారం బాతుగుడబ బీటీ రహదారి పునర్నిర్మాణానికి విప్ తోయక జగదీశ్వరి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మూలిగూడ ప్రధాన రహదారి నుంచి బాతుగుడబ వరకు 70 లక్షలతో 2.3 కిలో మీటర్లు వరకు బీటీరోడ్డు పునర్నిర్మించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో త్రివిక్రమరావు, టీడీపీ మండలాధ్యక్షుడు అడ్డాకుల నరేష్, నిమ్మక సింహాచలం, దాసు, దర్మారావు, లక్ష్మణరావు పాల్గొన్నారు.

అర్హులైన పింఛన్‌దారులకు న్యాయం చేస్తాం

గరుగుబిల్లి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): అర్హులైన దివ్యాంగ పింఛన్‌దారులకు న్యాయం చేస్తామని కురుపాం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ జగదీశ్వరి తెలిపారు. మంగళవారం గుమ్మలక్ష్మీపురంలో కురుపాం మండలంలోని దివ్యాంగ పింఛన్‌దారులకు న్యాయంచేయాలని, పింఛన్లు పునరుద్ధరించాలని కొప్పల వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ ఎ.మధుసూదనరావు, సంతోషపురం సర్పంచ్ రాంబాబు వినతిపత్రం అందించారు. కార్య క్రమంలో నీటి సంఘం అధ్యక్షులు పి.పాపినాయుడు, సర్పంచ్ జి.అప్పలనాయుడు, యడ్ల శ్రీనివాసరావు, పి.వెంకటరమణ పాల్గొన్నారు.

రైతులకు అండగా ఉండడమే ధ్యేయం

● పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర


పార్వతీపురం రూరల్: రహదారిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విజయచంద్ర

పార్వతీపురంటౌన్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వ హయాంలో రైతులకు అండగా నిలబడాలన్నదే ధ్యేయమని పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర తెలిపారు. మంగళవారం పార్వతీపురంలోని ఏఎంసీ ప్రాగంణంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్‌గా గొట్టాపు గౌరీ, వైస్‌ఛైర్మన్‌గా రౌతు వేణుగో పాలరావు, డైరెక్టర్లు కె.సన్యాసి, జి.పారినాయుడు, కె.మహందాతనాయుడు, కె.భవానీ, పి. రాంబాబు, పి.హిమబిందు, జి.రాములమ్మ, పి.స్వప్న, సి.హిమబిందు, ఆర్. చిన్నమ్మలు, ఎస్.హరిగోపాలరావు, పి.విజయ్‌కుమార్, జి.సాయిరామకృష్ణ ప్రమాణ స్వీకారం చేశారు.ఈ సందర్భంగా విజయచంద్ర మాట్లాడుతూ కూటమి వైసీపీ ప్రభుత్వం హయాం నుంచి నిలిచిపోయిన ఏఎంసీ ఛైర్మన్, డైరెక్టర్ల పదవు లను కూటమి ప్రభుత్వంలో భర్తీ చేసినట్లు తెలిపారు. ఛైర్మన్, పాటు డైరెక్టర్లు రైతులకు అన్నివిధాలుగా సహకరించి, ఏఎంసీ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు.

●పార్వతీపురం రూరల్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): అడ్డాపుశీల నుంచి వీఆర్ఎస్‌వలస, బాలగొడబ నుంచి వెంకటరాయుడిపేటకు నిర్మించిన రెండు బీటీ రోడ్లను ఎమ్మెల్యే విజయచంద్ర మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమన్నారు.

శుద్ధిచేసిన నీటిని సరఫరాచేస్తాం: డీఈ

సీతానగరం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): వర్షాలు కురుస్తుండడంతో బురద నీరు శుద్ధిచేసి సరఫరా చేస్తామని పార్వతీపురం సబ్ డివిజనల్ ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ హనుమంతరావు తెలిపారు.చినబోగిలిలో ఏఈ పవన్‌కు మార్, సర్పంచ్ కురమాన రాధతో కలిసి పైపులైన్లను పరిశీలించారు. చినబోగిలిలో పైపులైన్లు పాడ వడంతో పదిరోజులుగా ఎదుర్కొంటున్న నీటిసమస్య పరిష్కారమైందని తెలిపారు.

సీతంపేటలోనే ఐటీడీఏ కొనసాగించాలి

సీతంపేటరూరల్,ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి):సీతంపేటలోనే ఐటీడీఏ,డీడీ కార్యాలయాలు కొనసాగించాలని ఆదివాసీనాయకులు సవరతోట మొఖలింగం, బి.దమయంతినాయుడు కోరారు. మంగళవారం సీతంపేటలో నిర్వహించిన కార్యక్రమంలో సీతంపేట మన్యం ప్రాంతం ఏ జిల్లాలో, ఏ నియోజకవర్గంలో ఉంటే ఆదివాసీలకు లాభం చేకూరుతుందోనన్న అంశాపై చర్చలో పాల్గొన్న వారి నుంచి అభిప్రాయాలు సేకరించారు.మంత్రివర్గ సబ్‌కమిటీ ఏకాభిప్రాయంతో కూడిన నివేదికను సమర్పిస్తామని తెలిపారు. మరోసారి గిరిజనసంఘాలతో అత్యవసర సమావేశం నిర్వహిస్తామని చెప్పారు. సమావేశంలో గిరిజనసలహా మండలి సభ్యులు సవరతోట మొఖలింగం, సింహాచలం, మండంగి విశ్వనాథం, బి.రామ్మోహనరావు పాల్గొన్నారు.

అర్హులకు ఇళ్ల పట్టాలు: సబ్ కలెక్టర్


అచ్చెపువలస లేఅవుట్‌లో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్

వీరఘట్టం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి):అర్హులకు ఇళ్ల స్థల పట్టాలు అందేలా చూడాలని పాలకొండ సబ్ కలెక్టర్ స్వప్నిల్ పవర్ జగన్నాథ్ కోరారు. విక్రంపురం, వీరఘట్టంలోని గెంబలివీధిలో ఇళ్ల స్థల పట్టాల కోసం దరఖాస్తు చేసుకున్న వారితో మాట్లాడారు. 270 ఇళ్లపట్టాల కోసం దరఖాస్తులు వచ్చాయని, 80 దరఖాస్తులు పరిశీలన పూర్తయిందని తహసీల్దార్ సాయి కామేశ్వరరావు తెలిపారు. అనంతరం గతంలో పట్టాలిచ్చిన వీరఘట్టం సమీపంలో అచ్చెపువలస లేఅవుట్ పరిశీలించారు.

రేపు పాలకొండ జిల్లా సాధన సమితి ర్యాలీ

పాలకొండ, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి):పాలకొండ రెవెన్యూ డివిజన్‌ను జిల్లా చేయాలి లేదా శ్రీకాకుళంలో కలపాలని పాలకొండ జిల్లా సాధన సమితి సభ్యులు డిమాండ్‌చేశారు. మంగళవారం పాలకొండలో సాధన సమితి జిల్లా గౌరవాధ్యక్షుడు కనపాక చౌదరినాయుడు, జిల్లా అధ్యక్షుడు బుడితి అప్పలనాయుడు, వండాన కూర్మారావు, సబ్బ నానాజీ విలేకరులతో మాట్లాడారు. గురువారం ర్యాలీ నిర్వహించి ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తామని తెలిపారు.

విరిగిపడిన కొండచరియలు


కొండచరియలను తొలగిస్తున్న నీలకంఠాపురం పోలీసులు

కురుపాం రూరల్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి):మండలంలోని ఆగంగూడ బీటీరోడ్డులో ఆది, సోమవారాల్లో కురిసిన వర్షాలకు కొండ చరియలు విరిగిపడ్డాయి. దీంతో పలు గ్రామాలకు రాకపోకలకు ఇబ్బంది కలిగింది. నీలకంఠాపురం ఎస్ఐ నీలకంఠారావు మంగళవారం కొండచరియలను తొలగింపునకు చర్యలు తీసుకున్నారు. భారీవర్షాలకు తిత్తిరి పంచాయతీ ఆవిరి నుంచి గూనగూడకు వెళ్లే రహదారి తెగడంతో ప్రజల రాకపోకలకు ఇబ్బంది కలిగింది.

22న ప్రజావేదిక

గరుగుబిల్లి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): గరుగుబిల్లిలో ఈ నెల 22న ఉన్నతాధికారుల సమక్షంలో ప్రజావేదిక నిర్వహించనున్నట్లు ఎస్ఆర్‌పీ ఈదుబిల్లి పున్నపునాయుడు తెలిపారు.మంగళవారం వల్లిరిగుడబలో సర్పంచ్ గోవిందనాయుడు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతూ 25 పంచాయతీల్లో 2024-25 ఆర్థిక సంవత్సరానికి 20 కోట్లు వ్యయం జరిగిందన్నారు.

ధ్రువపత్రాలు సమర్పించాలి

పార్వతీపురం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): అనర్హుల నోటీసు అందుకున్న దివ్యాంగ పింఛన్‌దారులు ధ్రువపత్రాలు సమర్పించాలని కలెక్టర్ శ్యాంప్రసాద్ మంగళవారం ఒకప్రకటనలో పేర్కొన్నారు. పింఛన్‌దారులు ఎంపీడీవో, లేదా మునిసిపల్ కమిషనర్‌కు సంప్రదించాలని కోరారు.

టీబీ ముక్త్ భారత్‌పై శిక్షణ

పార్వతీపురం రూరల్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి):పార్వతీపురం ఎంపీడీవో కార్యాలయంలో వైద్యాధికారులు, ఫార్మాసిస్టు, ల్యాబ్ టెక్నీషియన్లకు ఆయుష్మాన్‌భారత్ డిజిటల్ మిషన్ టీబీ ముక్త్ భారత్‌పై శిక్షణ నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు చేరవయ్యేందుకు శిక్షణను సద్వి నియోగం చేయాలని డీఎంహెచ్‌వో భాస్కరరావు కోరారు.

నిలకడగా నాగావళి

గరుగుబిల్లి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): తోటపల్లి ప్రాజెక్టు పరిధిలోని నాగావళి నదిలో వరద ప్రవాహం నిలకడగా కొనసాగుతోంది. ఒడిశాలో వర్షాలు కురుస్తుండడంతో వరద ప్రవాహం నదిలోకి చేరుతోంది. మంగళవారం ఎగువ ప్రాంతం నుంచి సుమారు తొమ్మిది వేల క్యూసెక్కులకు పైగా వరద చేరింది. దీంతో ప్రాజెక్టు అధికారులు స్పిల్‌వే నుంచి దిగువ ప్రాంతాలకు ఎనిమిది వేల క్యూసెక్కుల మేర నీటిని విడుదల చేశారు. ప్రాజెక్టుకు సంబంధించి నీటి సామర్థ్యం 105 మీటర్లకు గాను 103.93 మీటర్లకు చేరింది.

ఒట్టిగెడ్డలో పెరిగిన ప్రవాహం

వీరఘట్టం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): ఒట్టిగెడ్డలో నీటి ప్రవాహం పెరిగింది. వరద నాగావళిలోకి నీరుచేరింది. మంగళవారం వీరఘట్టంతోపాటు పలు ప్రాంతాల్లో వర్షం కురవకపోవడంతో ప్రజలు ఊపిరిపీల్చుకున్నారు.

ఇంకా ముంపులోనే

(5వ పేజీ తరువాయి)

అది చెరువును తలపిస్తుంది. ఓని, స్కాట్‌దొరవలస రహదారి పనులు అర్థాంతరంగా నిలిచిపోగా.. అది కూడా పూర్తి బురదమయంగా మారింది. ఇటీవల ఆ గ్రామానికి చెందిన ఓ గర్భిణీకి డోలీ కట్టి పాలకొండ ఆసుపత్రికి తరలించినట్లు సమాచారం. పాలకొండ, విజయరాంపురం రహదారి కూడా అధ్వానంగా దర్శనమిస్తోంది. వీరఘట్టం మండలం సంత నర్సిపురం, దశమంతుపురం రహదారి, కత్తులకవిటి, రేగులపాడు, భామిని మండలంలో బొడ్డగూడ, యాతంగూడ రోడ్లు పరిస్థితి కూడా దారుణంగా ఉంది.

గిరిజన గ్రామాలైన కోటకొండ, కోసిమానుగూడ, గేదెలగూడ రహదారులు కూడా రాళ్లు తేలి అధ్వానంగా మారాయి. సీతంపేట మండలం రంగంవలస, వంబరిల్లి, పెద్దగూడ, చీడిమానుగూడ, గిడంగి, జగతిపల్లి తదితర గ్రామాల రహదారి పనులు అర్థాంతరంగా నిలిచిపోయాయి. ఇటీవల కురిసిన వర్షాలకు నిర్మాణంలో ఉన్న ఆ రోడ్లు కోతకు గురై యథాస్థితికి చేరాయి. ఈవిధంగా సీతంపేట మండలంలోనే 25 రోడ్లు కోతకు గురయ్యాయి. దీంతో ఆయా ప్రాంతాల గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సీతంపేట ఐటీడీఏ పరిధిలో గతంలో జరిగిన 36 రహదారి పనులపై విజిలెన్స్ విచారణ జరుగుతుండడంతో వాటి నిర్మాణం కూడా ముందుకు సాగడం లేదు. అయితే ఈ వర్షాలకు ఆయా రోడ్లు కూడా కోతకు గురయ్యాయి.

కట్టగలరో.. లేదో?

(5వ పేజీ తరువాయి)

17,465 ప్లాట్లు వేశారు. 10,623 ఇళ్లు మంజూరు చేయగా.. ఇందులో 371 గృహ నిర్మాణాలు నేటికీ ప్రారంభం కాలేదు. కేవలం గుంతలు తవ్విన ఇళ్లు 2,235 ఉండగా, బీబీఎల్ స్టేజ్‌లో 130, వీబీ స్టేజ్‌లో 732 , బీఎల్ స్టేజ్‌లో 1692, ఎల్ఎల్ స్టేజ్‌లో 2,146, ఆర్ఎల్ స్టేజ్‌లో 46, ఆర్సీ స్టేజ్‌లో 105 ఇళ్లు ఉన్నాయి. ఇప్పటివరకు 2,806 గృహ నిర్మాణాలు మాత్రమే పూర్తయ్యాయి. పార్వతీపురం పట్టణ లబ్ధిదారులకు సంబంధించి 25 లేఅవుట్లలో 3,871 ప్లాట్లు వేశారు. ఇందులో 1,740 ఇళ్లు మంజూరు కాగా, 337 గృహ నిర్మాణాలే పూర్తయ్యాయి. సాలూరు పట్టణానికి సంబంధించి 8 లేఅవుట్లలో 2,662 ప్లాట్లు వేశారు. 1997 మందికి స్థలాలు అందించారు. అయితే కేవలం 202 ఇళ్ల నిర్మాణాలే పూర్తయ్యాయి. పాలకొండ నగర పంచాయతీలో 1164 ఇళ్లు మాత్రమే పూర్తయ్యాయి. గత వైసీపీ ప్రభుత్వ హయాంలోనే సాలూరు పట్టణంలో సుమారు 373 మంది లబ్ధిదారులు ఇళ్ల పట్టాలను తిరిగి చ్చేశారు. నివాసాలకు అనుకూలంగా లేని చోట గృహ నిర్మాణాలు చేపట్టలేమని తేల్చిచెప్పారు. పార్వతీపురం పట్టణంలో జగనన్న కాలనీల కోసం సేకరించిన ఇంటి స్థలాలు అప్పట్లో కొంతమంది రెవెన్యూ అధికారులు, భూములు విక్రయించిన వారికి లాభాలు వచ్చాయి తప్ప పేదల సొంతింటి కల మాత్రం నెరవేరలేదు. ఇకపోతే గృహ నిర్మాణ శాఖలో కీలక పోస్టు లను భర్తీ చేయడం లేదు. జిల్లా మేనేజర్‌తో పాటు డీఈ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. జిల్లా హౌసింగ్ మేనేజర్‌గా ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ ధర్మచంద్రారెడ్డి అదనపు బాధ్యతలు నిర్వహి స్తున్నారు. పూర్తిస్థాయి అధికారులు లేకపోవడం వల్ల ఇళ్ల నిర్మాణాలపై పర్యవేక్షణ కొరవడింది.

● కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలపై దృష్టి సారించింది. నిర్మాణాల వేగం పెంచేందుకు ఎస్టీలకు రూ.75 వేలు, ఎస్సీ, బీసీలకు రూ.50 వేల చొప్పున అదనంగా ఆర్థిక సాయం అందించారు. ఈ మేరకు జిల్లాలో 3,618 మంది లబ్ధిదారులకు రూ.8.19 కోట్లు అందించారు. అయితే ఇప్పటివరకు కేవలం 808 మాత్రమే గృహ నిర్మాణాలు పూర్తి చేశారు. మిగిలిన వారు పనులు చేపట్టలేదు. దీంతో అదనపు ఆర్థిక సాయం పొందినా ఇళ్ల నిర్మాణాలు చేపట్టని వారికి అధికారులు నోటీసులు అందిస్తున్నారు. అదనపు సాయం పొందిన లబ్ధిదారులు ఆర్థిక స్థితి అనుకూలించక.. నివాసయోగ్యం కాని ప్రాంతాల్లో ఇళ్లు కట్టుకోలేక ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం డబ్బులను తిరిగి ఎలా ఇవ్వాలో తెలియక తలలు పట్టుకుంటున్నారు. ప్రభుత్వం స్పందించి తమను అన్ని విధాలా ఆదుకోవాలని వారు కోరుతున్నారు.

నోటీసులు అందిస్తున్నాం

గృహ నిర్మాణాలు వేగవంతంగా చేపట్టాలని లబ్ధిదారులకు అదనంగా ఆర్థికసాయం అందిం చాం. అయితే చాలామంది నేటికీ పనులు ప్రారంభించలేదు. ఇటువంటి వారికి నోటీసులు అందిస్తున్నాం. ఇల్లు కడతారో.. డబ్బులు తిరిగిస్తారో లబ్ధిదారులే తేల్చుకోవాలి.

- ధర్మ చంద్రారెడ్డి, ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్, జిల్లా గృహ నిర్మాణశాఖ ఇన్‌చార్జి అధికారి

మన్యంలో సాగు, తాగునీటి సమస్య పరిష్కరిస్తాం

(5వ పేజీ తరువాయి)

జిల్లా అభివృద్ధికి తమవంతు సహకారం అందిస్తాం. ప్రశాంత వాతావరణంలో ఉన్న జిల్లాలో ఉగ్రవాదుల కదలికలు ఉన్నట్లు సమాచారం ఉంది. అందరూ అప్రమత్తంగా ఉండాలి. ప్రధాని మోదీ నాయకత్వంలో అరాచక శక్తులకు తగిన బుద్ధి చెబుతున్నాం. జిల్లాలోని జంఝావతి, తోటపల్లి ప్రాజెక్టుల ద్వారా పూర్తిస్థాయిలో సాగు, తాగు నీరు అందిస్తాం. పార్వతీపురంలో తాగునీటి సమస్య పరిష్కరించేందుకు కృషి చేస్తాం. జిల్లాలో కేంద్రీయ విద్యాలయం, నవోదయ ఏర్పాటు ఎంతో అవసరం. కొత్త జిల్లాలకు గెజిట్ విడుదలైన తర్వాత అవి మంజూరవుతాయి. గిరిజన యూనివర్సిటీ పనులు 30శాతం పూర్తయ్యాయి. నిర్మాణం వేగవంతానికి కేంద్ర ప్రభుత్వం ద్వారా చర్యలు చేపడతాం. జిల్లాలో ఏనుగుల సమస్యను పరిష్కరిస్తాం. బీజేపీకి రావల్సిన నామినేటెడ్ పదవులను సాధిస్తాం. దీనిపై సీఎం చంద్రబాబు నాయుడుతో చర్చించాం. రేషియో ప్రకారం నామినేటెడ్ పదవుల కేటాయింపు ఉంటుంది. ఎవరూ నిరాశ పడొద్దు. ఈ విషయంలో కూటమి పార్టీల్లో కొంతమేర అసంతృప్తి ఉన్నమాట వాస్తమే. ఈ నెల 30న విజయవాడలో స్ఫూర్తి కార్యక్రమం పేరిట సంచార-అర్ధ సంచార విముక్తి దినోత్సవం నిర్వహిస్తాం.' అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు జి.సీతారామాంజనేయ చౌదరి, రెడ్డి పావని, జిల్లా పరిశీలకుడు ప్రకాశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.